RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:311 హైదరాబాద్, శుక్రవారం, 6 జూన్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## మున్సిపల్ ఎన్నికలకు
# తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధం

హైదరాబాద్ వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల రాష్ట్ర వ్యాప్తంగా 18 కొత్త మున్సిపాలిటీలు. 5 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు. 7 మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనం

మున్సిపల్ ఎన్నికలకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కొత్త మున్సిపాలిటీలలో వార్డుల విభజనకు కసరత్తు చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 18 కొత్త మున్సిపాలిటీలు, 5 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి. 7 మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనం అయ్యాయి. కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వార్డుల విభజన ప్రక్రియకు మున్సిపల్ శాఖ అధికారి శ్రీదేవి షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 21 వరకు వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులను ఆదేశించారు.

త్వరలో రిజర్వేషన్‌లు ఖరారు:

ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితాను తయారు చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. త్వరలో ఎన్నికలకు అవసరమైన రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా పూర్తికానుంది. అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తి కాగానే పట్టణ స్థానిక సంస్థల మున్సిపల్, ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరగనున్నాయి.

పునర్విభజన ఇలా:

కొహిర్, కేసముద్రం, అశ్వరావుపేట, స్టేషన్ ఘనపూర్, మద్దూర్, ఎదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్కుంద, కల్లూరు, అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరగనుంది. మహబూబ్ నగర్, మంచిర్యాల, కరీంనగర్, రామగుండం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు, నర్సంపేట, పరిగి, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, జగిత్యాల, హాలియా మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల్లోనూ కొత్త వార్డులు ఏర్పాటు కానున్నాయి. కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల విభజన తర్వాత జూన్ నెలాఖరు వరకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని భావిస్తోంది.



## మొక్కలు నాటకపోతే భవిష్యత్‌లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి: మంత్రి పొన్నం

%హైదరాబాద్: మొక్కలను నాటడంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మంత్రి మొక్కలు నాటారు.

## బెంగళూరు తొక్కిసలాట ఘటన..
# ఆర్సీబీ, కేఎస్‌సీఏపై కేసు నమోదు

బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కబ్బన్ పార్క్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్,



కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నేరపూరిత నిర్లక్ష్యం కేసులో ఈ సంస్థలను నిందితులుగా పేర్కొని భారతీయ న్యాయ సంహితలోని ఐదు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

కేసు విచారణ సీఐడీ చేతికి..!

మరోవైపు, ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కోర్టుకు ఇచ్చిన స్టేటస్ రిపోర్టులో ఈ విషయాన్ని ప్రభుత్వం పేర్కొంది. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును దర్యాప్తు చేస్తుందని తెలిపింది. తదుపరి దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేయాలన్న ఆదేశాలతో పాటు ఎఫ్ఐఆర్ కాపీని సీఐడీకి అప్పగించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ విషాద ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరుపుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తొక్కిసలాటకు కారణాలేంటి? తలెత్తిన లోపాలు, జవాబుదారీతనం వంటి అంశాలను పరిశీలించేందుకు డిప్యూటీ కమిషనర్, బెంగళూరు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ 15 రోజుల్లోగా విచారణ చేస్తారని ప్రభుత్వం తెలిపింది.

స్టేడియం వద్ద 2.5లక్షల మంది ప్రజలు గుమిగూడారని, బెంగళూరు నగర పోలీసుల నుంచి 1380 మంది సిబ్బంది, 13 కేఎస్‌ఆర్‌పీ ప్లాటూన్లు (325మంది సిబ్బంది)ని మోహరించి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. కానీ, జనం భారీగా తరలిరావడంతో పలు గేట్ల వద్ద తొక్కిసలాట జరిగి 11మంది మృతిచెందగా.. 56మంది గాయపడ్డారని తెలిపింది. 1, 6, 7, 17-21 గేట్ల వద్ద ప్రాణనష్టం జరిగినట్లు పేర్కొంది. వైద్య సహాయం వెంటనే అందించామని.. క్షతగాత్రుల్లో 50మంది అవుట్ పేషెంట్లుగా చికిత్స పొందగా, మరో ఆరుగురికి ఇంకా చికిత్స కొనసాగుతున్నట్లు పేర్కొంది.

స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితో పాటు మూడు అగ్నిమాపక వాహనాలు, రెండు అంబులెన్స్‌లు, రెండు డి-శ్వాట్ యూనిట్లు, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్ వాహనం మోహరించినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం క్షతగాత్రులకు వైద్య ఖర్చులన్నింటినీ భరించినట్లు తెలిపింది. అలాగే, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (%ఖూజాూ%) సైతం మృతులకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది.

## జూబ్లీహిల్స్ భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత

హైదరాబాద్: జూబ్లీహిల్స్ భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను వెంటనే గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. గుండె సంబంధిత సమస్యతో అస్వస్థతకు గురైనట్టు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆందోళనకంగా ఉన్నట్టు సమాచారం. మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు భారాస నేతలు ఏఐజీ ఆసుపత్రికి చేరుకుని గోపీనాథ్ ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స కొనసాగుతోందని హరీశ్‌రావు తెలిపారు.



## పెళ్లి బృందం కారును ఢీకొట్టిన డీసీఎం వాహనం.. చిన్నారి మృతి, వరుడికి గాయాలు



కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందం కారును డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 3 నెలల చిన్నారి రుద్ర మృతిచెందగా.. వరుడు సహా ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి నాందేడ్ నుంచి హుజూరాబాద్‌కు పెళ్లి బృందం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వరుడు గాయపడటంతో వివాహం ఆగిపోయింది. గాయపడిన వారు చికిత్స అనంతరం తిరిగి నాందేడ్ వెళ్లిపోయారు.

గాయపడిన వారుమహేశ్ (వరుడు)వాగ్మేర సితాల్‌వాగ్మేర మారుబాయివాగ్మేర దినేశ్‌వాగ్మేర సోనాలిడ్రైవర్ గణేశ్

## త్వరలోనే బాలికా రక్షక టీం.. మంత్రి సీతక్క ప్రకటన



%హైదరాబాద్, జూన్ 5: మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు మేధో మథన సదస్సు ప్రాణం పోసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన మేధో మధన సదస్సు ముగింపు సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మేధో మధన సదస్సు విజయవంతం అయ్యిందని.. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఈ సదస్సులో మహిళా శిశు సంక్షేమంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తమ విలువైన సలహాలు ఇచ్చారని అన్నారు.

మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక అడ్వైజరీ కమిటీ నియమిస్తామని చెప్పారు. వారి సలహాలు సూచనలతో శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత పటిష్టపరుస్తామని వెల్లడించారు. బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. స్వీయ రక్షణ టీంలుగా స్నేహ కమిటీలు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు. అంగన్వాడీ టీచర్ల ద్వారా అమ్మాయిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. మహిళ, బాలికల భద్రత మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్వాడీలను వారితో అనుసంధానం చేస్తామని అన్నారు. త్వరలో మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళ భద్రత కోసం పటిష్ట విధానాలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు.

## అమ్మ పేరుతో మొక్క నాటండి.. కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక పిలుపు



ఢిల్లీ: వాతావరణ మార్పులపై పోరాటానికి, భవిష్యత్ తరాల పరిరక్షణకు మొక్కలు నాటడమే శరణ్యమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగా భారతీయ పౌరులందరూ తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు(గురువారం) న్యూఢిల్లీ జంతర్ మంతర్‌లోని తన అధికారిక నివాసంలో బండి సంజయ్ మొక్కలు నాటారు. తన కార్యాలయ సిబ్బందితో కూడా మొక్కలు నాటించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మొక్కల పెంపకం ద్వారా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు బండి సంజయ్ కుమార్.

వాతావరణ మార్పులపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ కుమార్ అన్నారు. అలాగే జీవ వైవిధ్య పరిరక్షణ, భవిష్యత్ తరాలకు హరిత భూమిని అందించేందుకు మనమంతా సామూహిక బాధ్యతగా భావించాలని అభిప్రాయపడ్డారు. అందులో భాగంగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగితోపాటు ప్రతీ భారతీయ పౌరుడు 'ఏక్ పేడ్ మాకే నామ్' నినాదంతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. తద్వారా పర్యావరణ పరిరక్షణ అనేది ఇంటి నుంచే ప్రారంభమవుతుందని, తల్లుల అనురాగానికి, పోషణకు గుర్తుగా మొక్కలు నాటడం ఒక అర్థవంతమైన నివాళి అవుతుందని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## 'పహల్గాం' దోషులను ఇంకా పట్టుకోలేదు: జైరాం రమేశ్

: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి ఇప్పటికీ న్యాయం జరగలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్(%జీుఅతీుఎ =ుఎవంష్ర%) అన్నారు. అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రవాదులను ఇంకా పట్టుకోలేదన్నారు. ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి చినాబ్ ఉక్కు వంతెనను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసేందుకు శుక్రవారం కశ్మీర్‌కు వెళ్లనున్న నేపథ్యంలో జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.



పహల్గాం దాడిలో పాల్గొన్న ఇదే ఉగ్రమూక.. 2023 డిసెంబర్‌లో పూంఛ్‌లో, 2024 అక్టోబర్‌లో గుల్‌మార్గ్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల్లోనూ పాల్గొన్నట్లు కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు.

ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన ఘటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనికి ప్రతీకారంగా ఉగ్రవాదుల పీచమణిచేందుకు భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే.

భారత శక్తి
VOICE OF INDIAN

## అమెరికా దివాళ తీస్తోందా...

ప్రపంచ దేశాలకు పెద్దన్న.. అగ్రరాజ్యం..సంపన్న దేశం అమెరికా త్వరలోనే దివాలా తీస్తుందట. అవును ఈ మాటలు అన్నది మరెవరో కాదు..అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని డిపార్ట్ వెంట్ ఆఫ్ గవర్నవెంట్ ఎఫిఫియెన్సీ(డోజ్) బాధ్యతలను నిర్వర్తించి ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్. అందుకే అమెరికా దివాలా వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ట్రంప్ సర్కార్ తెచ్చిన ట్యాక్స్ బిల్లును వ్యతిరేకిస్తున్న మస్క్ ఇప్పటికే డోజ్ సారధ్య బాధ్యతల నుంచి వైదొలిగారు. కాంగ్రెస్ ఆమోదం కోసం వచ్చిన ట్యాక్స్ బిల్లుపై మస్క్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. నన్ను క్షమించండి..నేను ఇంతకంటే భరించలేను..'బిగ్ బ్యూటిఫుల్ బిల్' అత్యంత దారుణమైంది..కాంగ్రెస్ వ్యయ బిల్లు బిల్లు చాల చెడ్డది. దీంతో అమెరికన్లపై అధిక భారం పడుతుందని తెలిపారు. అది తప్పుడు బిల్లు అని మీకు తెలుసు. దీనికి ఓటు వేసిన వారు సిగ్గు పడాలి. అయినా ఈ బిల్లుకు మద్దతుగా ఓటేశారంటే అది మీకే అవమానం అని పేర్కొన్నారు. ఈ బిల్లు కారణంగా ద్రవ్యలోటు 2.5ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని..ఇది ఇలాగే కొనసాగితే అమెరికా దివాలా తీయడం ఖాయమని మస్క్ హెచ్చరించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య చెడిందనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలో ఓ బిల్లు విషయమై ట్రంప్‌పై మస్క్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్రంప్ ప్రతిపాదించిన ఖర్చు బిల్లును 'అసహ్యకరమైన ఘోరమైన చర్య'గా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల వైట్ హౌస్ నుంచి మస్క్ నిష్క్రమించిన తరువాత, ఈ ఇద్దరి మధ్య ఉన్న విబేధాలు తాజాగా బయటపడ్డాయి. మస్క్ గత వారం డోజ్ చీఫ్ పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వ వృథా ఖర్చులను నివారించి, పాలనలో పారదర్శకత కోసం డోజ్‌ను ట్రంప్ ఏర్పాటుచేశారు. ధీనికి నాయకత్వం వహించిన మస్క్.. ఖర్చులను నివారించడాన్ని ట్రంప్ ప్రశంసించారు. కానీ అప్పటికే ఇద్దరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి.'ఈ భారీ, దారుణమైన, అర్థరహిత ఖర్చులతో నిండిన కాంగ్రెస్ బిల్లు ఒక అసహ్యకరమైన ఘోరమైన చర్య. ఇది మానవాళిపై భారంగా మారుతుంది.. దీనికి ఓటేసిన వారందరికీ సిగ్గుపడాలి. మీరు తప్పు చేశారన్న విషయం మీకే తెలుసు' అని మస్క్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు. 'ట్రంప్ బిగ్, బ్యూటిఫుల్ బిల్'పై మస్క్ ఈ వ్యాఖ్యలు చేయడం తొలిసారి కాదు. ఈ బిల్లు వచ్చే 10 ఏళ్లలో అమెరికా రుణాలను 3 ట్రిలియన్ డాలర్లకు పెంచుతుందని అంచనా. ఇది ఆరోగ్య, ఆహార సహాయం వంటి ముఖ్యమైన కార్యక్రమాలకు భారీగా కోతలు పెట్టే ప్రయత్నంగా భావిస్తున్నప్పటికీ.. వాస్తవానికి ఖర్చు పెరుగుతాయి.డోజ్ శాఖ అధ్యక్షుడు ట్రంప్ రెండో పదవీ కాలంలో ఏర్పాటైంది. దీని ప్రధాన లక్ష్యం ప్రభుత్వ వ్యయంలో వృథాను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచడం. ఎలాన్ మస్క్, టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈవోగా తన అనుభవాన్ని ఉపయోగించి, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులను సూచించారు.ఎలాన్ మస్క్, ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త, ఆవిష్కర్త, అమెరికా అధ్యక్ష సలహాదారుగా తన పదవి నుంచి వైదొలగడం ఒక ముఖ్యమైన రాజకీయ సంఘటనగా నిలిచింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' (డోజ్) శాఖ సారథిగా మస్క్ అందించిన సేవలు, అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. అయితే, మే 30న తన పదవి గడువు ముగియడంతో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మస్క్‌కు ఘనమైన వీడ్కోలు పలికారు.డోజ్ శాఖ అధ్యక్షుడు ట్రంప్ రెండో పదవీ కాలంలో ఏర్పాటైంది. దీని ప్రధాన లక్ష్యం ప్రభుత్వ వ్యయంలో వృథాను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచడం. ఎలాన్ మస్క్, టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈవోగా తన అనుభవాన్ని ఉపయోగించి, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులను సూచించారు. ఉదాహరణకు, అనవసరమైన ప్రభుత్వ ఉద్యోగాలను తొలగించడం, బడ్జెట్ కోతల ద్వారా ట్రిలియన్ డాలర్ల వథా ఖర్చును నియంత్రించడం వంటి సంస్కరణలను ప్రతిపాదించారు. ఈ సంస్కరణలు ప్రభుత్వ ఖర్చులను 20?30% వరకు తగ్గించే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే మస్క్ వ్యాపార దృక్పథం, ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యం డోజ్ శాఖను ఒక ప్రత్యేకమైన సంస్థగా మార్చాయి. అయితే, ఈ సంస్కరణలు కొంతమంది వద్ద విమర్శలను కూడా రేకెత్తించాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు సూచనలపై.మే 30న మస్క్ అధ్యక్ష కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో, ట్రంప్ ఆయనకు బంగారు రంగు తాళం చెవిని బహుమతిగా అందించారు. ఈ బహుమతి ప్రత్యేక వ్యక్తులకు మాత్రమే అందించబడుతుందని, ఇది దేశం తరఫున మస్క్ సేవలకు గుర్తింపుగా ఇవ్వబడిందని ట్రంప్ తెలిపారు. ప్రెస్ మీట్‌లో మస్క్ అవిశ్రాంత కృషిని, ఆవిష్కరణలను, దేశ అభివృద్ధికి అందించిన సహకారాన్ని ట్రంప్ కొనియాడారు. ఈ గుర్తింపు మస్క్ యొక్క ప్రభావాన్ని మరియు డోజ్ శాఖ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది.మస్క్ వైదొలగడం వెనుక బహుముఖ కారణాలు ఉన్నాయి. అమెరికా చట్టాల ప్రకారం, ఒక వ్యక్తి 130 రోజులకు మించి ఈ హోదాలో కొనసాగలేరు, ఇది మస్క్ పదవీ కాలం ముగింపుకు ఒక చట్టబద్ధ కారణం. అయితే, మీడియా కథనాల ప్రకారం, ట్రంప్ 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్' కు వ్యతిరేకతగా మస్క్ ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొనబడింది. ఈ బిల్ ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతుందని, డోజ్ శాఖ లక్ష్యాలను నీరుగారుస్తుందని మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. అదనంగా, కృత్రిమ మేధ సంస్థ ఓపెన్‌ఏఐ, యూఏఈ మధ్య ఒప్పందంపై మస్క్ వ్యతిరేకత కూడా ఒక కారణంగా చెప్పబడుతోంది.

# మంత్రులకు సుతి మెత్తని క్లాస్

విజయవాడ, జూన్ 5,

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రులు మాట్లాడే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంత్రుల మధ్య సమన్వయం కొరవడితే నవ్వుల పాలవుతామని, ఒకే అంశంపై మాట్లాడేటప్పుడు అందరూ ఒకే విధంగా మాట్లాడితే ప్రజల్లోకి సరైన పద్ధతిలో వెళుతుందని చంద్రబాబు అన్నారు. అంతే తప్ప ఎవరికి వారు ఒకే అంశంపై వేర్వేరు విధంగా మాట్లాడితే ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకత పెంచుకునే అవకాశముందని చెప్పారు. అందుకే మాట్లాడే ముందు మంత్రులు సబ్జెక్ట్ పై అవగాహనకు వచ్చి మాట్లాడాలని, సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా మంత్రులందరూ చంద్రబాబుకు అభినందనలు తెలిపారుకొందరు మంత్రుల పనితీరును... అయితే మంత్రులు ఇంకా పనితీరును మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని, కేవలం శాఖపరమైన విషయాలు మాత్రమే కాకుండా పార్టీ సంబంధిత విషయాలను గ్రౌండ్ లెవెల్లో ఏం జరుగుతుందన్నది ఎప్పటికప్పుడు తెలుసుకుని తమకు కేటాయించిన జిల్లాల్లో పరిస్థితులను తమకు తెలియజేయాలని కోరారు. అలాగే కార్యకర్తలకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని కూడా చంద్రబాబుఅన్నారు. ఈ ఏడాదిలో అనేక మంది కొత్తగా మంత్రి పదవులు చేపట్టారని, వచ్చేఏడాదికి పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని చంద్రబాబు సూచించారు. చాలా మంది మంత్రుల పనితీరు బాగుందని, అయితే కొందరు మాత్రం కొంత తమ వ్యవహారశైలితో పాటు పనితీరులో కూడా మార్పులు చేసుకోవాలని ఆయన అన్నారు... ప్రత్యర్థి పార్టీ నేతల అరెస్ట్ ల గురించి ఆలోచించవద్దని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసి ఉంటే ఖచ్చితంగా అరెస్ట్ అవుతారని చంద్రబాబు తెలిపారు అది జగన్ అయినా మరొకరయినా ఒకటే న్యాయం ఉంటుందని అన్నారు. నిత్యం ప్రజల్లో మమేకమవుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, సోషల్ మీడియాలో పాటు పత్రికల్లో వచ్చే వార్తలకు కూడా మంత్రులు స్పందించాలని, లేకపోతే అందులో వచ్చే వార్తలు నిజమని ప్రజలు భావించే అవకాశముంటుందని, ఆ ఛాన్స్ ఎవరూ తీసుకోవద్దని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు ముందుండాలని కూడా చంద్రబాబు మంత్రులను ఆదేశించారు.

### ఏడాది పాలనపై బాగుందనే ఫీలింగ్

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కావస్తుంది. ఈ ఏడాది పాలనలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై చర్చ జరుగుతుంది. అయితే కూటమి ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించడం లేదు. ఏడాది మాత్రమే కావడంతో ప్రజలు ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. అదే సమయంలో జగన్ ఐదేళ్ల పాలనతో బేరీజు వేసుకుని చూస్తే ఇటు పరవాలేదని చెప్పలేని పరిస్థితి. అటు బాగా లేదని అనలేని స్థితి ఉంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ప్రతి ఒక్కరి మనసులో అభివృద్ధి జరగాలని ఆశిస్తారు. అదే సమయంలో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఉండాలని భావిస్తారు. అయితే ఏడాదిలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల అంచనాలు, ఆలోచనలు అందుకోలేకపోయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.. రోడ్లు బాగుండాలని కోరుకుంటారు. పరిశ్రమలు రావాలని అనుకుంటారు. పది మందికి ఉపాధి అవకాశాలు దక్కాలని ఆశిస్తారు. నిరుద్యోగ సమస్య లేకుండా తక్కువ ధరలకు నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు సహజంగా కోరుకుంటారు. ఈ విషయాల్లో కూటమి ప్రభుత్వానికి మంచి మార్కులే పడతాయి. ఎందుకంటే వచ్చిన వెంటనే రహదారులను మరమ్మతులు చేశారు. పరిశ్రమలు కూడా ఒక్కొక్కటి వస్తున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగయితాయన్న భావన ప్రజల్లో ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి సహకారం అందుతుండటంతో నిధులు సమకూరడంతో పాటు పరిశ్రమలు కూడా త్వరగానే వస్తాయని ప్రజలు భావిస్తున్నారు. అయితే మిగిలిన తొమ్మిది నెలల్లో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుంటే పరవాలేదని పించేలా ఉందని ప్రజలు అంటున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలపై మాతరం పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛను నాలుగు వేల రూపాయలకు పెంచడం ఒకే. అదే సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అందచేస్తున్నారు. అంతకు మించి రైతులకు, మహిళలకు, విద్యార్థులకు సంబంధించిన పథకాలను గ్రౌండ్ చేయలేకపోవడంతో ఒకింత ఆ వర్గం ప్రజలు మాత్రం పెదవి విరుస్తున్నారు. జగన్ హయాంలో తమ బ్యాంకు అకౌంట్లో డబ్బులు ఉండేవని, కానీ కూటమి సర్కార్ ఏర్పాటయిన ఏడాదిలో అకౌంట్ లోకి పైసా పడకపోవడంపై ఒకింత అసంతృప్తి కనిపిస్తుంది. కానీ చంద్రబాబు మాత్రం గత ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిందని, వరసగా అన్ని పథకాలను అమలు చేస్తామని, ఇచ్చిన హామీలతో క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పడం ఒకింత ఊరటనిచ్చే అంశమే. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అందచేయనున్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని కూడా అమలు చేస్తామని ప్రకటించారు. కానీ ఒకేసారి కాకుండా విడతల వారీగా జమ చేస్తామని చెప్పడం ఒకింత ప్రజల్లో అసహనంకలుగుతుంది. రెండు నుంచి మూడు వేలు వస్తే ఉపయోగం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరొకవైపు ఆగస్టు పదిహేనో తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు అందిస్తుండటంతో రానున్న కాలంలో ఈ ఒపీనియన్ లో మార్పు వచ్చే అవకాశముందన్న భావనలో టీడీపీ నేతలున్నారు.

# ఊపు ఎక్కడా....

విజయవాడ, జూన్ 5,

ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ఈ ఏడాదిలో వైసీపీ పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా వైసీపీకి లభించలేదు. 175 నియోజకవర్గాలకు గాను కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వైసీపీకి వచ్చాయి. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటయిన శాసనసభ సమావేశాలకు కూడా వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కావడం లేదు. దీంతో ప్రజాసమస్యలను శాసనసభలో ప్రస్తావించేవారు లేదు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తానని జగన్ పట్టుబట్టడం కూడా ప్రజల్లో ఒకరకమైన వ్యతిరేక భావన ఏర్పడింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వెళతామని అనడం సరికాదన్న కామెంట్స్ బాగానే వినిపిస్తున్నాయి,శాసనసభలో వైసీపీ వాయిస్ లేకుండా పోయింది. ఇది జగన్ పార్టీకి మైనస్ అని చెప్పాలి. అదేసమయంలో జగన్ ఏడాది నుంచి బెంగళూరు నుంచి విజయవాడ కు ట్రిప్పులు వేస్తున్నారు. నెలలో కొన్ని రోజులు మాత్రమే నేతలకు అందుబాటులో ఉంటున్నారు. స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకోవడంతో ఆయన తరచూ లోకల్ లీడర్లతో భేటీ అవుతున్నారు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనన్న నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా స్థానిక సంస్థలన్నీ కూటమి పరమయిపోయాయి. ఇక ఉగాది నుంచి జిల్లాల పర్యటనలు చేస్తానని ప్రకటించిన వైఎస్ జగన్ ఎప్పటికప్పుడు తన పర్యటనను వాయిదావేసుకుంటూ వెళుతున్నారు. ఏడాది కూటమి ప్రభుత్వంలో తమ వారిపై నమోదవుతున్న కేసుల విషయంలోనే జగన్ కొంత పట్టించుకుంటున్నారు. ఏడాది నుంచి నియోజకవర్గాల ఇన్ ఛార్జులతో సమావేశం కాలేదు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. చివరకు తన సొంత జిల్లా కడపలోనూ నేతలతో ఆయన సమావేశమవ్వడం తక్కువేనని అంటున్నారు. ఈసారి అధికారంలోకి వస్తే కార్యకర్తలకు ప్రాధాన్యత నిస్తామని చెబుతున్న జగన్ మాత్రం నేతలకు సంబంధించి ఎటువంటి భరోసా ఇవ్వడం లేదు. గత ఎన్నికల్లో ఇష్టారీతిన నియోజకవర్గాలను మార్చేశారు. నేతలకు పట్టున్న నియోజకవర్గాల నుంచి బయటకు పంపారు. ఈ ప్రయోగం విఫలమయిందని తెలిసినా తిరిగి అక్కడ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో ఏడాదిగా ఆ యా ప్రాంతాల్లో క్యాడర్ అయోమయంగా ఉంది.మరొక వైపు అప్పుడప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేస్తున్నప్పటికీ, మీడియా సమావేశాలు పెడుతున్నప్పటికీ జగన్ ఇంకా పూర్తి స్థాయిలో జనానికి అందుబాటులోకి రాలేదు. తాడేపల్లి కేంద్ర కార్యాలయానికే అధికారంలో లేనప్పుడు కూడా పరిమితమయ్యారు. రైతుల సమస్యలపై కొంత వెళుతున్నప్పటికీ జగన్ 2019 ఎన్నికలకు ముందు చేసిన తరహాలో దీక్షలు, ధర్నాలు వంటివి చేయకపోవడం పార్టీ క్యాడర్ లో ఇంకా ఊపు తెప్పించలేకపోతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అది జనంలోకి బలంగా వెళ్లగలిగేలా మాత్రం ఆయన చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదన్నది మాత్రం యదార్థం.ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడంలో కనీసం యాభై శాతం కూడా సక్సెస్ కాలేకపోయినట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

# ఇమేజ్ పెరిగిందా...డ్యామేజ్ అయిందా

గుంటూరు, జూన్ 5,

జనసేన అధినేతగా జనంలోకి వచ్చి అధికారాన్నిచేపట్టిన పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈరోజుకు గత ఏడాది ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జనసేనకు హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు వచ్చింది. ఇరవై ఒక్క అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ గెలిచారు. దాదాపు పదిహేడు శాతం ఓటు బ్యాంకును కూడా సొంతం చేసుకుంది. తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టారు. కీలకమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖతో పాటు తనకు అత్యంత ఇష్టమైన అటవీ శాఖను అడిగి మరీ తీసుకున్నారు. తనతో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కు కేబినెట్ లో అవకాశం కల్పించారు. తొలిసారి మంత్రి పదవి తీసుకోవడంతో కొన్ని రోజుల పాటు తనకు అప్పగించిన శాఖలపై పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి అధ్యయనం చేశారు. కేరళలో ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ ను తన టీంలోకి తెచ్చుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో రహదారులు, మంచినీటి సమస్యలను ప్రధానంగా తొలగించేందుకు ఒకింత పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నాలు ఫలించాయని చెప్పాలి. పంచాయతీలకు నిధులు విడుదల చేయించడంలో పవన్ కల్యాణ్ సక్సెస్ అయ్యారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులను నిర్మించి అటవీ పుత్రులకు అండగా తాను ఉన్నానన్న భరోసాను పవన్ కల్యాణ్ ఇవ్వగలిగారు. ఇక ఏనుగుల దాడి నుంచి పంటలను రక్షించేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించడంలో కీలకంగా వ్యవహరించారు.ఇక ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో పవన్ కల్యాణ్ కొన్ని నిర్ణయాల పట్ల మౌనంగా ఉండటం, ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోవడం ఒకింత ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేస్తుందనే చెప్పాలి. పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, తాను పవర్ లోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రశ్నించే వారు ఎక్కువయ్యారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తనకు తాను ప్రకటించుకున్న పవన్ కల్యాణ్ ప్రశ్నల గురించి మానేశారు. ఆయన ప్రభుత్వ నిర్ణయాలకు తలూపటమే ఇప్పుడు విమర్శలకు తావిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత సమస్యల పరిష్కారానికి పాటుపడకపోవడంపై పవన్ మౌనాన్ని సోషల్ మీడియాలో చాలా మంది తప్పుపడుతున్నారు. . నిజానికి ప్రభుత్వంలో ఉండి బహిరంగంగా విమర్శించడానికి అవకాశం లేదు. అంతర్గత సమావేశాల్లోనే తనకున్న అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. చంద్రబాబు కేబినెట్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉండి బహిరంగంగా విమర్శలు చేస్తే అది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుంది. ఎవరైనా ఇలాగేనే చేస్తారు. కానీ పవన్ కల్యాణ్ అంతర్గత సమావేశాల్లోనూ తలూపి రావడం వల్లనే ఈ విమర్శలు ఎక్కువయ్యాయని అంటున్నారు. ఆయన గత ఎన్నికల సందర్భంగా మాట్లాడిన మాటలు, ఇచ్చిన హామీలను ట్రోల్ చేస్తూ వైసీపీ నేతలు పవన్ కల్యాణ్ వెంట పడుతున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ నిజాయితీగా ఉన్నప్పటికీ, తన శాఖల విషయంలో మంచి పురోగతి సాధించినప్పటికీ ప్రశ్నించడం మానేసి ప్రజల్లో చులకనయ్యారంటున్నారు.

## కామాక్షి పీఠం పీఠాధిపతి కామేశ మహర్షి కన్నుమేత

అమలాపురం

అమలాపురం కామాక్షి పీఠం పీఠాధిపతి కామేశ మహర్షి కన్ను మూసారు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు స్వామిజీ కన్నుమూసారు. ఆరు నెలలుగా స్వల్ప అనారోగ్యంతో ఉన్నారు. కామాక్షి పీఠాధిపతి పూర్తి పేరు బెహరా ఎర్రం రాజు కామేశ మహర్షి. వందలాదిమంది అనాథ పిల్లలకు తన ప్రేమ మందిరంలో ఆశ్రయం కల్పించి వారి ఆలనా పాలన చూసారు.

## టీటీడీ నూతన సివిఎస్వోగా మురళీకృష్ణ

తిరుమల జూన్ 5,

టీటీడీ నూతన సివిఎస్వో గా ఐపీఎస్ అధికారి కెవి మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారిని దర్శించుకొని...రంగనాయకుల మండపంలో సివిఎస్వో గా అధికారిక బాధ్యతలు చేపట్టారు. మురళీకృష్ణ గతంలో తిరుమల, తిరుపతిలో పలు హోదాల్లో మురళీకృష్ణ కు పని చేసిన అనుభవం వుంది

## సంతోష్ నగర్ కార్పొరేటర్ మృతి

హైదరాబాద్ జూన్ 5,

పాతబస్తీ సంతోష్ నగర్ కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్ గుండెపోటు తో మృతి చెందారు. కాంచన్ బాగ్ ఒవైసీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతి చెందారు. సంతోష్ నగర్ కార్పొరేటర్ ముజఫర్ మృతి ని ఒవైసీ ఆసుపత్రి వైద్యులు ధృవీకరించారు.

## నేలకొండపల్లిలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం జూన్ 5,

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్ళలా చూస్తూ ఇందిరమ్మ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు.ఎన్ని కష్టాలు ఉన్నా అభివృద్ధి కుంటుపడకుండా సంక్షేమాన్ని అందిస్తామని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇందిరమ్మ ప్రభుత్వం లో పేద ప్రజలకు అందిస్తున్నామని ఆయన చెప్పారు.రాష్ట్రంలో రైతులు పండించిన సన్న వడ్లకు మద్దతు ధర తోపాటు ఐదువందల బోనస్ ఇచ్చామని ఆయన తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.కారు కూతలు కూసే నాయకులకు రానున్న రోజుల్లో కర్రు కాల్చి వాతలు పెట్టక తప్పదని ఆయన అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పెళ్లికొడుకుకు తీవ్ర గాయాలు

జగిత్యాలకొండగట్టు వద్ద పెళ్లి బృందం కారును డీ సీ ఎం వ్యాను ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న పెళ్లి కొడుకు మహేష్ తో పాటు ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదంలో రుద్ర (3) చిన్నారి మృతి చెందింది. గాయపడ్డ వారిని జగిత్యాల ఆస్పత్రి కి తరలించారు. మహారాష్ట్ర నాందేడ్ నుండి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ కు పెళ్లి బృందం బయలుదేరింది. గురువారం పెళ్లి జరుగాల్సి ఉంది. రోడ్డు ప్రమాదంతో పెళ్ళంట విషాదం నెలకొంది.

## వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరుప్రపంచ పర్యావరణ దినోత్సవం సంధర్భంగా దెందులూరు మండలం జోగన్నపాలెం , ముప్పవరం , దెందులూరు జడ్పీ హై స్కూల్ నందు జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధికారులు , కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

భారత శక్తి



# నెక్ట్స్ ఎవరు...

విజయవాడ, జూన్ 5,

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు, మాజీ మంత్రి పేర్ని నాని, కొడాలి నాని, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే కొందరు ముందస్తు బెయిల్ పొందారు. ముందస్తు బెయిల్ దక్కని వారు అజ్ఞాతంలోకి వెళ్ళిపోతున్నారు. జరుగుతున్న పరిణామాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు జూన్ భయం పట్టుకుందా? ఈ నెలలో కీలక అరెస్టులు ఉంటాయని తెలుస్తోందా? పక్కా ఆధారాల సేకరణలో కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందా? కీలక నేతల అరెస్టులు ఉంటాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ప్రస్తుతం వల్లభనేని వంశీ మోహన్, కాకాని గోవర్ధన్ రెడ్డి, నందిగాం సురేష్ వంటి నేతలు జైల్లోనే గడుపుతున్నారు. ఇప్పట్లో వారికి బెయిల్ వచ్చే అవకాశం కనిపించడం లేదు. మరోవైపు జూన్ నెలలో మద్యం కుంభకోణానికి సంబంధించి కీలక అరెస్టులు ఉంటాయని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు, మాజీ మంత్రి పేర్ని నాని, కొడాలి నాని, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే కొందరు ముందస్తు బెయిల్ పొందారు. ముందస్తు బెయిల్ దక్కని వారు అజ్ఞాతంలోకి వెళ్ళిపోతున్నారు. జరుగుతున్న పరిణామాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.ముఖ్యంగా మద్యం కుంభకోణం ఏపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ కుంభకోణంలో సూత్రధారిగా పరిగణిస్తున్న రాజ్ కసిరెడ్డి, ఆయన అనుచరుడు అరెస్టయ్యారు. అటు తరువాత వైసిపి హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారిగా పనిచేసిన ధనుంజయ రెడ్డి, జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ కూడా అరెస్టు కాబడ్డారు. ఇంకోవైపు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లి అరెస్టు కాకుండా తాత్కాలికంగా ఉపశమనం పొందారు. అయితే జూన్లో మద్యం కుంభకోణానికి ఎండ్ కార్డు పడుతుందని.. కీలక నేతతో పాటు ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అరెస్ట్ కావడం ఖాయమని ప్రచారం జరుగుతోంది.అయితే నెల్లూరు జిల్లామైనింగ్ అక్రమాలకు సంబంధించి కాకాని గోవర్ధన్ రెడ్డి అరెస్టయ్యారు. అయితే ఆయన చాలా రోజులపాటు అజ్ఞాతంలో ఉండేవారు. న్యాయస్థానాల్లో ముందస్తు బెయిల్ దక్కకపోవడంతో ఆయన ఇతర రాష్ట్రాల్లో గడిపే వారన్న ప్రచారం ఉంది. ఈ తరుణంలో కేరళలో ఉన్న గోవర్ధన్ రెడ్డిని ఏపీ పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇంకోవైపు మాజీ మంత్రి కొడాలి నాని కి లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి. విదేశాలకు పారిపోకుండా అన్ని ఎయిర్పోర్టులకు, పోర్టులకు కేంద్ర హోం శాఖ లుక్ అవుట్ నోటీసులు జారీచేసింది. ఆయన అరెస్టు ఖాయమని ప్రచారం జరుగుతోంది. పల్నాడు జిల్లాలో జంట హత్యలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి సోదరుల హస్తం ఉందని పోలీసులు అనుమానిస్తూ కేసు నమోదు చేశారు. వారి అరెస్టు ఖాయమని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మరోవైపు బియ్యం మాఫియాకు సంబంధించిన కేసులో మాజీమంత్రి పేర్ని నాని చుట్టూ కూడా పుచ్చు బిగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ అరెస్టులు, కేసుల నమోదు విషయంలో కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. కేసుల్లో నిందితులకు న్యాయస్థానాలను ఆశ్రయించే విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో వారి అరాచకాలను ఆధారాలతో సహా న్యాయస్థానాలు ముందు ఉంచాలని కూడా కసరత్తు చేస్తోంది. తద్వారా వారు నిజంగా తప్పు చేశారని.. తాము ఎటువంటి కక్ష సాధింపు చర్యలకు దిగలేదని చెప్పే ప్రయత్నం చేస్తోంది. మొత్తానికైతే వైసీపీ నేతలకు జూన్ గండం అయితే మాత్రం ఉందని తెలుస్తోంది. మరి ఎంతమంది అరెస్ట్ అవుతారో చూడాలి.

## మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి ఎంపీపీ ,ఎండిఓ లు పిలుపు

బ్రహ్మంగారిమఠం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బ్రహ్మంగారి మఠం మండలం ఎంపీపీ వీర నారాయణరెడ్డి , మండల తెదేపా అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి , ఎంపీడీవో వెంగమునిరెడ్డి లు ప్రాంగణంలో మొక్కలు నాటారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకొని కుటుంబానికి ఒకటి చొప్పున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు అంతేకాకుండా మొక్కలు ఎంత బాగా నాటితే ఆ పరిసరాలు బాగుంటాయని మానవులు పీల్చుకునే గాలితోపాటు చెట్లను వదిలేసి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు కాబట్టి మండలంలో ప్రతి కుటుంబం నుంచి ఒక్కొక్క చెట్టును నాటి వాటి పరిరక్షణను కాపాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్ ఆర్ శ్రీనివాసులరెడ్డి, సాంబశివా రెడ్డి, పూజా శివ , ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్,ప్రిన్సిపాల్ అనూష, సర్పంచ్ సుదర్శన్, ఏపీఓ హరి, ఏపీఎం ఓబులేసు, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, రామ జ్యోతి, దస్తగిరి, జూనియర్ అసిస్టెంట్ సుజనేంద్ర, సుధాకర్, నాగయ్య, సూరి , గంగరాజు, ఈశ్వర్ తో సహా సచివాలయ, వెలుగు, కస్తూరిబా , ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

## రాష్ట్ర మంత్రులకు లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ వినతి

మంథని, జూన్ 5,

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దాదాపు 50 వేల మందికి పైగా ఉన్న న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి లకు లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ న్యాయవాదుల బృందం వినతి పత్రం అందజేశారు.

ఈ మేరకు గురువారం సాయంత్రం జరగనున్న తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తమ సమస్యలను ప్రస్తావించాలని కోరడం జరిగింది. ఈ మేరకు 50 వేల మంది పైగా న్యాయవాదుల మరియు వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో లో పేర్కొన్న 10 లక్షల వరకు హెల్త్ కార్డులు వెంటనే పునరుద్ధరణ చేయాలని, అదేవిధంగా జూనియర్ న్యాయవాదులకు 5వేల రూపాయల స్టైఫండ్ ఇవ్వాలని,అలాగే నోటరి నోటిఫికేషన్ విడుదల చేయాలని,న్యాయవాదుల కు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న హైకోర్టు ప్రాంగణంలో దివ్యాంగులైన న్యాయవాదులకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, దివ్యాంగుల చట్టం 2016 మేరకు హైకోర్టు ప్రాంగణంలో తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని,వివిధ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు..ఈ కార్యక్రమంలో లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి పొన్నం రవీందర్, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇనుముల సత్యనారాయణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆలె నర్సింహా,హైకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆంటోనీ రెడ్డి , కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బలహీనులపై దాడి ? పోలీసులకే అవమానం

నిర్మల్, జూన్ 5,

పోలీసులు ఓ వృద్ధ రైతును మెడపెట్టి బయటకు గెంటేసిన వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కలకలానికి కారణం అయింది. భూభారతి చట్టం తెచ్చినందున నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సుల్లో తన సమస్యను చెప్పుకునేందుకు నిర్మల్ జిల్లాలో ఓ రైతు ఎమ్మార్వో ఆఫీసుకు వచ్చాడు. అక్కడ ఉన్న అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆ వృద్ధరైతును మెడపట్టి బయటకు గెంటేశారు. ఈ దృశ్యాలు వైరల్ అయ్యాయి. దీంతో ప్రభుత్వంపై అందరూ విరుచుకుపడ్డారు. ఆ పోలీసును సస్పెండ్ చేశారు. కానీ జరగాల్సినా నష్టం జరిగింది.

ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వాలు చేసే తప్పులను సవరించుకోవడానికి వారు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. తప్పు ప్రభుత్వం, అధికారులు చేస్తారు.. బాధితులుగా ప్రజలు నిలుస్తారు. ఇలాంటి వారు ఆఫీసులకు వచ్చినప్పుడు ఛీత్కారాలు ఎదురవుతాయి. తప్పు చేసిన వాడే దిద్దడానికి సతాయిస్తాడు. ఇలాంటి విషయాల్లో ప్రజలకు కోపం వస్తుంది. ఇలాంటి సామాన్యుల విషయంలో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ చూపించాలి. అది వారి బాధ్యత కూడా. కానీ నిర్మల్ లో రాంచందర్ అని అసిస్టెంట్ సబ్ ఇన్స్ పెక్టర్ అన్ని హద్దులూ దాటిపోయారు. 90 ఏళ్ల వృద్ధుడిపై ప్రతాపం చూపించారు.సామాన్యులపై జులుం ప్రదర్శించడం మాత్రం పోలీసుల ఇమేజ్ ను మసక బారుస్తుంది.

## తొక్కిసలాట పై సుమోటో గా తీసుకున్న కర్నాటక హైకోర్టు

బెంగళూరుతొక్కిసలాట ఘటనపై సుమోటోగా కేసు ఆర్సీబీ విజయోత్సవంలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనను కర్ణాటక హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ కేసుపై కోర్టు విచారించనుంది. కాగా, బుధవారం బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆర్సీబీ విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందగా.. 50 మంది గాయపడ్డారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జవాను కుటుంబానికి కోటి రూపాయల బీమా అందజేత



సిద్దిపేట

రోడ్డు ప్రమాదంలో మరణించిన పరంధాములు కుటుంబానికి ఎస్బిఐ శాలరీ ప్యాకేజ్ క్రింద 1 కోటి రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును పోలీస్ కమిషనర్ అనురాధ, ఎస్బిఐ రీజినల్ మేనేజర్ మారుతి అందచేసారు.

గత సంవత్సరం డిసెంబర్ నెలలో రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ వర్కోలు పరంధాములు మృతి చెందాడు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పోలీస్ శాలరీ ప్యాకేజ్ స్కీం కింద 1,00,000,00/– కోటి రూపాయల చెక్కును పరంధాములు కుటుంబ సభ్యులకు పోలీస్ కమిషనర్ ఎస్బిఐ రీజనల్ మేనేజర్ మారుతి వారి బృందం కలసి కమిషనర్ కార్యాలయంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్బిఐ రీజనల్ మేనేజర్ మారుతి మాట్లాడుతూ 24 గంటలు విధులు నిర్వహించే పోలీస్ డిపార్ట్మెంట్ కు ఎస్బిఐ బ్యాంకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ ప్యాకేజ్ శాలరీ ప్యాకేజ్ కింద సంబంధిత బ్రాంచ్ కి వెళ్లి వెళ్లేటప్పుడు మూడు నెలల పే స్లిప్పులు, ఆధార్ కార్డు పాన్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకొని వెళ్లి అకౌంటును మార్చుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులు సిబ్బంది వారి వారి యొక్క శాలరీ అకౌంట్ ను పోలీస్ శాలరీ ప్యాకేజీలోకి మార్చుకోవాలని సూచించారు. ఏదైనా జరగరానిది జరిగితే కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కొంత తోడ్పాటునిస్తుందని తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న అధికారుల సిబ్బంది యొక్క శాలరీ పోలీస్ సాలరీ అకౌంట్లోకి మార్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చిన డబ్బులను పిల్లల భవిష్యత్తు చదువుల గురించి జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎద్దుల కొండ ప్రాంతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జిల్లా కలెక్టర్ చేతన్ జిల్లా డివిజన్ అధికారులు ప్రజలు సత్యసాయి బాబా సేవాదళ్ సభ్యులు



పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ ప్రాధాన్యత గురించి భావితరాలకు చెట్లు ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతన్ అందరి చేత పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ఇది ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని ప్రతి నీటి బొట్టును ఆధా చేసుకుందామని ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పుట్టపర్తి లోని ఎద్దుల కొండలో మొక్కలు నాటామని పర్యావరణాన్ని రక్షించే ఈ బృహత్తర కార్యక్రమంలో నేను పాల్గొనడం చాలా ఆనందాన్ని ఇస్తుందని. చెట్లు మానవ జీవన మనుగడకు ఎంతో ఉపయోగపడతాయని. ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను నాటి మరొకరికి ఆదర్శంగా నిలచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని పచ్చని చెట్లు ప్రగతికి సోపానం అని నేటి కాలంలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వంటి వస్తువులను పూర్తిగా నిషేధించాలని. అంతేకాకుండా వర్షాలు సమృద్ధిగా కురవాలి అన్న కాలుష్యాన్ని నివారించి ఆరోగ్యపరమైన ఆక్సిజన్ మానవ జీవన మనుగడకు అందించాలన్న చెట్లు ఎంతో అవసరం అని అటువంటి చెట్లను నరకకుండా అటవీ సంపదను కాపాడుకొని భావితరాలకు మనం బాసటగా నిలుస్తూ. చెట్ల యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతి నీటి చుక్క కూడా వృధా చేయకుండా కాపాడుకుందామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, తో పాటు శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ చేతన్, ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్ కుమార్, సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జిల్లా అధికార యంత్రాంగం, అటవీ శాఖ అధికారులు,ఒకసారి సేవాదళ్ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని చెట్లను నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కుప్పంలో దొంగల ముఠా హల్చల్

కుప్పం

చిత్తూరు జిల్లా కుప్పంలో దోపిడి దొంగల ముఠా హల్ చల్ చేసింది. హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన దోపిడి దొంగలు ముఠా సభ్యుడిని రైల్వే స్టేషన్ లో పోలీసులు అరెస్ట్ చేసారు. గురువారం ఉదయం పుష్ ఫుల్ ట్రైన్ లో బెంగళూరు వెళ్ళేందుకు సిద్ధం అవుతుండగా అరెస్ట్ చేసారు. మిగిలిన నలుగురు గ్యాంగ్ స్టర్స్ ముఠా కోసం ఆరా తీస్తున్నారు. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. అంతకుముందు కుప్పం పోలీసులకు గ్యాంగ్ స్టర్ లకు మధ్య తంబిగాని పల్లి చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తుండగా కాల్పులు చోటు చేసుకన్నాయి. ఐదుగురు సభ్యులతో కూడిన గ్యాంగ్ స్టర్స్ ముఠా పరారీ అయింది. ఘటనలో ఒక ముఠా సభ్యుడికి తొడలో బుల్లెట్ గాయామయింది. ఈ నేపథ్యంలో డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ తో కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బెవనపల్లి, చీలే పల్లి, పరమ సముద్రం ప్రాంతాల్లో పోలీసులు జల్లెడ పడుతున్నారు. కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలో తహాశీల్దార్లకు లకు ఎమర్జెన్సీ మెసేజ్ ద్వారా వి.ఆర్. ఏ, వి.ఆర్ వో లను గ్రామాల్లో ఆర్డీవో అప్రమత్తం చేసారు. హిందీ మాట్లాడుతూ, తొడలో బుల్లెట్ గాయంతో చికిత్స పొందుతున్న వివరాలు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసారు.

## మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి ఏపిఎమ్ ఫరీద్ ఖాన్

కౌతాళం ప్రతి ఒక్కరు తమ బాధ్యత తీసుకొని కుటుంబానికి ఒకటి చొప్పన మొక్కలు నాటాలని ఏపిఎం ఫరీద్ ఖాన్. మండల సమైక్య అధ్యక్షురాలు పిలుపునిచ్చారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనం ప్రాంగణంలో మొక్కలు నాటారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు ఎంత బాగా నాటితే ఆ పరిసరాలు బాగుంటాయని మానవులు పీల్చుకునే గాలితో పాటు చెట్లను నుంచి వచ్చే గాలి ఆరోగ్యం కు ఎంతో దోహద పడుతుందని అన్నారు. కాబట్టి మండలంలో ప్రతి కుటుంబం నుంచి ఒక్కొక్క చెట్టును నాటి వాటి పరిరక్షణను కాపాడాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ అకౌంటెంట్ మంజునాథ్, తులసి. మల్లె ప్రభ. కవిత.మహిళా సంఘం సభ్యులు గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, మొక్కల పంపిణీ...

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం వనమహోత్సవంలో భాగంగా జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంటలో మొక్కలు నాటి, మెప్మా సంఘ సభ్యులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, మాట్లాడుతూ ఒక మార్పు అభివృద్ధి వైపు అనే నినాదంతో ప్రతి



ఒక్కరు ఒక్క మొక్కను నాటి, సంరక్షించి పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు మొక్కలను రక్షిద్దామని సంకల్పించారు. ప్రతి సంఘ సభ్యురాలు మీ ఇంటి నుండే మొక్కలు నాటడం మొదలు పెట్టాలని, మీ ఇంటితో చుట్టూ పక్కల, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి, పర్యావరణాన్ని రక్షించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈలు నరేష్, వికాస్, టిపిబిఒ.దీపిక, ఆర్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శానిటరీ ఇన్ స్పెక్టర్ మహేష్, సదానందం, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, వార్డు ఆఫీసర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉస్మాన్ పాషా, కుమార్, రాజేందర్ , మెప్మా సి. ఎల్.అర్పిలు జ్యోతి, మంజుల, అర్పిలు, పరిశుద్య కార్మికులు, హరితహారం సిబ్బంది పలువురు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

## నా చారిత్రక విజయానికి ఏడాది పూర్తి

### మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం వైకాపా రాక్షస పాలనకు అంతం పలికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టిన చారిత్రక సందర్భాన.. నన్ను తొలిసారిగా గెలిపించిన మైదుకూరు నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదములు. నాకు టికెట్ ఇచ్చి ఆశీర్వదించిన మా ప్రియతమ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, నన్ను సోదరునిలా భావించి అడుగడుగునా అండగా నిలిచిన యువనేత శ్రీ నారా లోకేష్ బాబు గారికి నా జీవితాంతం రుణపడి ఉంటాను.. నా గెలుపు కోసం ఎన్నో నిర్బంధాలు, అక్రమ కేసులను ఎదుర్కొంటూ.. తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేనన్నారు.నా విజయానికి సహకరించిన నియోజకవర్గ ప్రజలకు జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలందరికీ.. నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారునా జీవితం మైదుకూరు నియోజకవర్గ ప్రజలకే అంకితమని శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు.

# జూలై 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జూన్ 5,

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. పార్లమెంటు వర్షాకాల సమావేశాల షెడ్యూల్ విడుదల చేసింది. జులై 21వ తేదీ నుంచి ఆగస్ట్ 12వ తేదీ వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఒకవైపు.. ఆపరేషన్ సిందూర్ గురించి చర్చకు పట్టుబడుతున్న ప్రతిపక్షాలు.. పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరచాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కేంద్రం నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. అయితే నిబంధనల ప్రకారం పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే అన్ని అంశాలపై చర్చించవచ్చని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు సంబంధించి.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ తేదీలను సిఫార్సు చేసినట్లు కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని.. ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఆపరేషన్ సిందూర్ గురించి పూర్తి సమాచారం ప్రజలకు వెల్లడించాలని.. ఆపరేషన్ సిందూర్ గురించి పార్లమెంటులో చర్చించాలని పట్టుబడుతున్న ప్రతిపక్ష పార్టీలు.. ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేసిన విషయం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై స్పందించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు.. తాము నిబంధనల ప్రకారం వర్షాకాల సమావేశాల్లోనే అన్ని అంశాలపై చర్చించవచ్చని వెల్లడించారు. దీంతో ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ అయిన ఆపరేషన్ సిందూర్‌ను పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే చర్చించే అవకాశం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈసారి సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ తొలి ప్రాధాన్యతా అంశంగా మారనుంది. అయితే ఆపరేషన్ సిందూర్ గురించి పార్లమెంటు ఉభయ సభల్లో చర్చిస్తే.. సభలు ఎంతవరకు సజావుగా సాగుతాయి అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందిఆపరేషన్ సిందూర్ జరిగినప్పటి నుంచి.. దానిపై చర్చించేందుకు స్పెషల్ పార్లమెంట్ సెషన్స్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సహా దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ కేంద్రంలోని మోదీ సర్కార్‌ను డిమాండ్ చేస్తున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం అందుకు ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలోనే పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు సంబంధించిన షెడ్యూల్ రావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే నరేంద్ర మోదీ సర్కార్‌ను నిలదీయాలని విపక్షాలు భావిస్తున్నాయి. మరోవైపు.. గత కొన్ని రోజులుగా ఆపరేషన్ సిందూర్ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని.. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే.

# మొక్కలు పెంచడం మనం దిన చర్య గా భావించాలి: మంత్రి పొన్నం

గోల్కొండ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గోల్కొండ ఏరియా హాస్పిటల్ లో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్,పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు , గోల్కోడ ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్, వైద్యాధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి పక్షాన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. చెట్లు నీడ ఇవ్వడంతో పాటు ఆక్సిజన్ అందిస్తాయి చెట్లు దేవుడిగా కొలుస్తాం. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ లో వచ్చే తరం ఆక్సిజన్ పెట్టుకునే స్థాయికి వస్తుంది. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి. డాక్టర్లు వైద్యో నారాయణ హరి అనే విధంగా కొలుస్తారు. గోల్కొండ ఏరియా హాస్పిటల్ కి వచ్చే వారికి మొక్కలు నాటే అవగాహన కల్పించాలి. ఢిల్లి కాలుష్యం ఐపోతుంది.. అక్కడ నుండి వేరే రాష్ట్రాలకు పోతున్నారు..వాహనాలు నడిపించే పరిస్థితి లేదు. కాలుష్యాన్ని నియంత్రణ చేసుకోకపోవడం వల్ల చిన్న పిల్లల నుండే అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని అన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి గా రాష్ట్ర ప్రభుత్వం పక్షాన హైదరాబాద్ ను మరో ఢిల్లి కాకుండా హైదరాబాద్ ప్రకృతి కి మారు పేరుగా ఉండాలంటే ఇక్కడ మనం చెట్లు నాటాలి. తెలంగాణ మాది అనుకునే ప్రతి వ్యక్తి పర్యావరణాన్ని కాపాడడానికి ఒక శక్తిగా పని చేయాలి. అందరు పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలి..ప్లాస్టిక్ ను మన దయనందిన జీవితం నుండి దూరం చేయాలి. మొక్కలు పెంచడం మనం దిన చర్య గా భావించాలి.. జన్మదినం లకు ప్రత్యేక రోజులకు మొక్కలు నాటాలని అన్నారు.

# సింగరేణి బెస్ట్ పర్యావరణ గనిగా ఓసిపి1 ఎంపిక...

కామన్ పూర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సింగరేణి ఆర్జీ3 ఓసి1 ఆపరేషన్స్ సైట్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాజమాన్యం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓసి1 ప్రాజెక్టు అధికారి జే రాజశేఖర్ గని మేనేజర్ డి రమేష్, అడిషనల్ మేనేజర్ బైరి రమేష్, సంక్షేమ అధికారి పి సాయికృష్ణ, ఏఐటీయూసీ యూనియన్ పిట్ కార్యదర్శి డిటి రావు, ఐఎన్టియూసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్, అధికారులు, ఉద్యోగులతో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి మనకోసం ప్రకృతిని ప్రేమించి భవిష్యత్తును పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓసి1 ముందుందని పర్యావరణ పరిరక్షణలో మొక్కలు నాటడంతో పాటు, గని ఆవరణలో అటవీ జీవాల కోసం నీళ్లు ఏర్పాటు చేసిన సందర్భాన్ని గుర్తు చేస్తూ సింగరేణిలో పర్యావరణ గనిగా ఓసీ1 ఎంపికై మొదటి స్థానంలో నిలిచి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ చే గని తరుపున ఓసి1 పర్యావరణ అధికారి కె.కిషన్ అవార్డు తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉందని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పర్యావరణ హితంకోరి వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడం, నీటి సంరక్షణ మొదలైన వాటికి సంబంధించి జీవనశైలిలో మార్పు యొక్క ప్రాముఖ్యతపై ఉద్యోగులకు అవగాహన కల్పించి సింగరేణి సంస్థ చైర్మన్ గారు విడుదల చేసిన సంబంధిత కరపత్రాలను అందజేశారు.

# తొక్కిసలాటల్లో 189 మంది మృతి

హైదరాబాద్, జూన్ 5,

దేశంలో గత ఏడాది కాలంలో పలు తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ విషాధ ఘటనల్లో ఇప్పటివరకు 182 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొన్ని వందల మంది గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలోనే తాజాగా చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో ఇప్పటిదాకా 11 మంది మృతి చెందారు. గతేడాది ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా సందర్భంగా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన దగ్గరి నుంచి తాజా ఘటన వరకు ఏమేం ఘటనలు జరిగాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

ఐపీఎల్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలవాలని దేశవ్యాప్తంగా 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కోట్లాది మంది ఫ్యాన్స్ ఆశలు నెరవేరుస్తూ.. మంగళవారం ఆర్సీబీ పంజాబ్‌పై జయభేరి మోగించి.. కప్‌ను ముద్దాడింది. ఈ నేపథ్యంలోనే ఆర్సీబీ జట్టుకు బెంగళూరులో ఘన సన్మానం చేశారు. అయితే ఆర్సీబీ విక్టరీ పరేడ్ సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్రగ్భ్రాంతిని కలిగించింది. ఈ ఘటనలో ఏకంగా 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 33 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే దేశంలో గత ఏడాది కాలంగా జరిగిన 6 తొక్కిసలాట ఘటనల్లో 182 మంది మృతి చెందారు. మరికొన్ని వందల మంది గాయాల పాలయ్యారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో 18 మంది, మహా కుంభమేళాలో 30 మంది, గోవా ఆలయంలో ఆరుగురు, తిరుపతిలో ఆరుగురు, హైదరాబాద్ సంధ్యా థియేటర్ వద్ద ఒకరు, హత్రాస్ సత్సంగ్ 121 మంది ప్రాణాలు కోల్పోయారు.

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట

ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన దేశ రాజధానిలోని న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది దుర్మరణం పాలయ్యారు. వీరిలో 11 మంది మహిళలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. ఈ ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళాకు వెళ్లేందుకు రైళ్ల కోసం వేచి ఉన్న ప్రయాణికులు.. ఒక్కసారిగా గందరగోళానికి గురై పరుగులు తీయడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది. స్టేషన్‌లోని 14, 15 ప్లాట్‌ఫారాలను కలిపే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై కొంతమంది ప్రయాణికులు జారిపడటంతో ఈ విషాదం జరిగింది. రైలు బయలుదేరడంలో ఆలస్యం, ప్రతి గంటకు 1500 జనరల్ టికెట్ల విక్రయించడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అంతేకాకుండా రైలు ప్లాట్‌ఫారాలు మారినట్లు తప్పుడు ప్రకటనలు రావడం ప్రయాణికుల్లో గందరగోళం సృష్టించడంతో.. అది ఈ తొక్కిసలాటకు దారితీసినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తొక్కిసలాట

144 ఏళ్లకోసారి జరిగే మహా కుంభమేళా సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో కనీసం 30 మంది మరణించగా.. 60 మంది గాయపడ్డారు. జనవరి 29వ తేదీన మౌని అమావాస్య సందర్భంగా అమృత్ స్నానం చేసేందుకు కోట్లాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది.

గోవా ఆలయంలో తొక్కిసలాట

ఉత్తర గోవాలోని షిర్‌గావ్‌లో జరిగిన వార్షిక లైరై దేవి జాతర (ఊరేగింపు)లో తొక్కిసలాట జరగడంతో కనీసం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. రాజధాని పనాజి నుంచి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీ దేవి లైరై ఆలయం వద్ద ఈ వార్షిక ఉత్సవం నిర్వహించగా.. దాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అధిక రద్దీ, సరిపడా భద్రతా బలగాలు లేకపోవడం గందరగోళానికి దారితీసి తొక్కిసలాటకు కారణమైందని వార్తలు వెలువడ్డాయి.

తిరుపతి తొక్కిసలాట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల టోకెన్ల పంపిణీ సందర్భంగా తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు విడిచారు. ఈ ఏడాది జనవరి 8వ తేదీన తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద వైకుంఠ ద్వార సర్వదర్శనం, భక్తుల కోసం ప్రత్యేక దర్శనం, టోకెన్ల పంపిణీ సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. 10 రోజుల పండుగ కోసం దర్శనం టోకెన్లను జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి పంపిణీ చేయాల్సి ఉండగా.. అర్ధరాత్రి నుంచే కౌంటర్ల వద్ద వేలాది మంది భక్తులు చేరుకున్నారు. దీంతో టికెట్ కౌంటర్ల వద్ద తీవ్ర గందరగోళం చెలరేగడంతో తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. క్యూ లైన్లలో ఉన్న ఒక మహిళకు ఆరోగ్యం బాగోలేదని సహాయం చేయడానికి గేటు తెరవగా.. భక్తుల గుంపు మొత్తం ఒకేసారి ముందుకు దూసుకురావడంతో గందరగోళం చెలరేగినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

సంధ్యా థియేటర్ తొక్కిసలాట

గతేడాది డిసెంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఉన్న సంధ్యా థియేటర్‌లో పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకుంది. హీరో అల్లు అర్జున్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్ వద్ద గుమిగూడటంతో మెయిన్ గేటు విరికిగిపోయింది. ప్రేక్షకులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో 35 ఏళ్ల మహిళ ప్రాణాలు కోల్పోగా.. ఆమె 9 ఏళ్ల కొడుకు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం అతడ్ని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా.. ఇటీవలె డాక్టర్లు డిశ్చార్జ్ చేశారు.

హత్రాస్ సత్సంగ్ తొక్కిసలాట

గతేడాది జూలైలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని హత్రాస్‌లో ఉన్న భోలే బాబా అని పిలువబడే నారాయణ్ సాకర్ హరి సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాట పైన చెప్పిన అన్ని ఘటనల కంటే చాలా పెద్దది. ఈ సత్సంగ్‌లో భారీగా భక్తులు గుమిగూడినపుడు తీవ్ర గందరగోళం చెలరేగింది. దీంతో తొక్కిసలాట జరగ్గా.. అక్కడ 121 మంది మరణించారు. సత్సంగ్ నిర్వాహకులు 80 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేయగా.. అంచనాలకు మించి ఏకంగా 2.5 లక్షల మందికి పైగా హాజరయ్యారు.

సింహాచలంతొక్కిసలాట

విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి జరిగింది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతిచెందగా, ఒకరు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. తెల్లవారుజామున సింహాచలంలో 3:30 గంటలకు ఉరుములు, మెరుపులు, భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ కౌంటర్ వద్ద ఇటీవల నిర్మించిన గోడ కుప్పకూలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మరోవైపు భారీ ఈదురుగాలుల ధాటికి రేకులు, ఐరన్ పైపులు పడడంతో గోడ కూలిపోయింది. మహిళ ఆర్తనాదాలతో ఆలయ సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు చంద్ర రాజేశ్వరరావు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

చంద్ర రాజేశ్వరరావు భారత స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామ్యవాదిగా, తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న నాయకుడిగా గుర్తింపు పొందారు. రాజేశ్వరరావు తీరాంధ్ర ప్రాంతపు సంపన్న కమ్మ రైతు కుటుంబంలో జన్మించాడు. 28 సంవత్సరాలకు పైగా భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.) కి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండి 1992లో ఆనారోగ్యకారణాల వల్ల విరమించుకున్నాడు. అంతర్జాతీయ కమ్యూనిస్టు దృక్పథంతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను, శాంతి ఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళినందుకు రాజేశ్వరరావును 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' అవార్డు తో సోవియట్ యూనియన్, 'ఆర్డర్ ఆఫ్ డెమిట్రోవ్' అవార్డుతో బల్గేరియా, అలాగే చెకోస్లోవేకియా, మంగోలియా దేశాలు అవార్డులతో సత్కరించాయి. దేశ సమైక్యతను కాపాడడం కోసం బాబ్రీ మసీదు ను మ్యూజియంగా కాపాడాలని, రాజీ ఫార్ములా ప్రతిపాదించాడు. రాజేశ్వరరావు సంపన్న రైతు కుటుంబం నుండి వచ్చారు. అతను జూన్ 6, 1914 న భారతదేశంలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం , కృష్ణా జిల్లా , మంగళపురం గ్రామంలో జన్మించాడు. అతను తన వైద్య విద్యను వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో, విశాఖపట్నంలోని వైద్య కళాశాలలో పొందాడు . అతను 1931లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా లో చేరాడు. ఆయన 1954, 1955లో ఆల్-ఇండియా కిసాన్ సభ (రైతుల లీగ్) ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. డిసెంబర్ 1964లో అతను జాతీయ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

మానవతా వాది అయిన రాజేశ్వరరావు పార్టీ కార్యాలయాలలో పనిచేసే చిన్న కార్యకర్తలను సైతం ఆప్యాయంగా పలకరించేవాడు. కారుగానీ, కార్యదర్శిగాని లేకుండానే పని నిర్వహించారు ఢిల్లీ లో వేసవిలో ఉష్ణోగ్రత భరించరానంత ఉన్నప్పటికీ కూలర్ కాని, ఎముకలు కొరికే చలి ఉన్నా హీటర్ కానీ వాడలేదు. పార్టీ క్యాంటీన్‌లో వాలంటీర్లతో కలిసే భోజనం చేసేవాడు. "నాకు ఆస్తిపాస్తులు లేవు. నేను ఎవరికీ ఏమీ ఇవ్వవలసిన అవసరం లేదు. ఎవరి నుంచీ ఏమీ తీసుకోలేదు" అనేవాడు. పంచె కాలిపైకి కట్టి, నెత్తికి తలగుడ్డ చుట్టి గ్రామీణ ప్రజలతో కలిసిపోవడం ఆయన నైజం. గ్రాంథిక భాష వాడడు. ఎదుటివారు తన వైఖరిని, విధానాలను విమర్శించినా చాలా ఓపికతో వినేవాడు. మహిళలు సభలకు హాజరయ్యేందుకు వీలుగా రాత్రి వేళల్లో సమావేశాలు పెట్టవద్దని సూచించేవాడు. హరిజన, గిరిజన, మైనారిటీ వర్గాలపై దాడులు జరిగితే వెంటనే స్పందించి స్వయంగా వెళ్ళేవాడు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఐక్య కార్యాచరణ ముందుకు సాగాలని కోరుకునేవాడు. రాజేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ 1994 ఏప్రిల్ 9న మరణించాడు. ఆయన స్మారకార్థం హైదరాబాదు శివార్లలోని కొండాపూర్‌లో ఉన్న చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లో కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్రీశ్రీ 1947లో భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్న చంద్రరాజేశ్వరరావును అనుసరించి ఎన్నికల సభల్లో పాల్గొనేవారు. ఈ సమయంలో చంద్ర రాజేశ్వరరావు నంద్యాల రాజకీయ సభలో శ్రీశ్రీని మొట్టమొదటి సారి మహాకవి అన్నారు, ఆ తర్వాత సాహిత్యలోకంలోనూ, సాధారణ ప్రజల్లోనూ కూడా శ్రీశ్రీకి మహాకవి అన్న బిరుదు స్థిరపడిపోయింది. ఆయన కుమారుడు చంద్ర చంద్రశేఖర్, మనవడు చంద్ర జైదీప్ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాల్లో ఉన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తి కోసం అలుపెరగని పోరాటం సాగించిన రాజేశ్వరరావు ఆ ఉద్యమ ధ్రువతారగా చిరస్మరణీయులు.

# నేను విన్నాను... నేను ఉన్నాను అంటున్న కేటీఆర్

హైదరాబాద్, జూన్ 5,

కేటీఆర్, జగన్ మోహన్ రెడ్డి ప్రసిద్ధ డైలాగ్ "నేను విన్నాను... నేను ఉన్నాను"ను ఒక ఇంటర్వ్యూ లేదా బహిరంగ సమావేశంలో ఉటంకించారని సోషల్ మీడియా పోస్ట్‌లు సూచిస్తున్నాయి. ఈ డైలాగ్ జగన్ 2019 ఎన్నికల సమయంలో తన పాదయాత్రలో విస్తృతంగా ఉపయోగించిన "నేను విన్నాను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) కొన్ని రోజులుగా సహనం కోల్పోతున్నారు. ఓటమి తర్వాత కేటీఆర్ వైఖరిలో చాలా మార్పులు వచ్చాయి. అప్పటి వరకు డీసెంట్ నేత అనుకున్న అందరూ ఆయన నోటివెంట వస్తున్న మాటలు చూసి షాక్ అవుతున్నారు. తాజాగా ఆయన తన మిత్రులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డైలాగులను ఉటంకిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవి రాజకీయ వర్గాల్లో సంచలనం రేకెత్తించాయి. సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ డైనమిక్స్‌పై కొత్త చర్చకు దారితీసింది. కేటీఆర్, జగన్ మోహన్ రెడ్డి ప్రసిద్ధ డైలాగ్ "నేను విన్నాను? నేను ఉన్నాను"ను ఒక ఇంటర్వ్యూ లేదా బహిరంగ సమావేశంలో ఉటంకించారని సోషల్ మీడియా పోస్ట్‌లు సూచిస్తున్నాయి. ఈ డైలాగ్ జగన్ 2019 ఎన్నికల సమయంలో తన పాదయాత్రలో విస్తృతంగా ఉపయోగించిన "నేను విన్నాను? నేను ఉన్నాను" అనే నినాదం నుంచి పుట్టింది, ఇది మొదట వైఎస్ రాజశేఖర రెడ్డి బయోపిక్ "యాత్ర" సినిమాలో ప్రముఖంగా వినిపించింది. 2023లో ఒక యూట్యూబర్ సందీప్‌తో జరిగిన ఇంటర్వ్యూలో కేటీఆర్, జగన్‌తో తన వ్యక్తిగత స్నేహాన్ని ప్రస్తావిస్తూ, వారిద్దరూ దావోస్ పర్యటనలో రెండు గంటల పాటు కలిసి డిన్నర్ చేశామని చెప్పారు. ఈ సందర్భంలో జగన్‌ను "పెద్దన్న లాంటి వాడు" అని సంబోధించారు. ఈ స్నేహం, రాజకీయ సందర్భంలో జగన్ డైలాగులను కేటీఆర్ ఉపయోగించడానికి ఒక నేపథ్యంగా కనిపిస్తుంది. 2025 మార్చి 23న ఒక ఎక్స్ పోస్ట్‌లో, కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులను ఉత్తేజపరిచిందని, ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని పేర్కొన్నారు. కేటీఆర్ జగన్ డైలాగులను ఉపయోగించడం వెనుక రాజకీయ వ్యూహం కనిపిస్తుంది. 2023 తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఓటమి తర్వాత, కేటీఆర్, జగన్ ఇద్దరూ తమ పార్టీలను పునర్నిర్మించే ప్రయత్నంలో ఉన్నారు. కేటీఆర్, జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా, వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారుల మనోభావాలను ఆకర్షించే ప్రయత్నం చేసి ఉండవచ్చు, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సమానమైన రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో. జగన్ యొక్క "నేను విన్నాను? నేను ఉన్నాను" డైలాగ్ ప్రజల సమస్యలను ఆలకించడం, వారికి అండగా ఉండటం అనే సందేశాన్ని సూచిస్తుంది. కేటీఆర్ ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా తెలంగాణలో ప్రజలతో తన సాన్నిహిత్యాన్ని, వారి సమస్యల పట్ల తన నిబద్ధతను చాటి ఉండవచ్చు. అలాగే, ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా జగన్‌తో తన స్నేహాన్ని, రాజకీయ సహకారాన్ని హైలైట్ చేసే ప్రయత్నం కూడా కనిపిస్తుంది. కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ఒక ఎక్స్ పోస్ట్‌లో, "జగన్ అన్న డైలాగ్ కేటీఆర్ గారు చెప్తే ఫైర్" అని పేర్కొన్న యూజర్, ఈ వ్యాఖ్యలు వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులను ఉత్తేజపరిచాయని తెలిపారు. ఈ డైలాగ్ వైరల్ కావడంతో, రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో కేటీఆర్ వ్యూహాత్మకంగా జగన్ ఇమేజ్‌ను ఉపయోగించుకున్నారనే చర్చ మొదలైంది. అయితే, ఈ వ్యాఖ్యలు కొంత వివాదాన్ని కూడా రేకెత్తించాయి. 2024లో ఒక నివేదిక ప్రకారం, కేటీఆర్, జగన్ ఇద్దరూ సోషల్ మీడియా ద్వారా రాజకీయ ప్రచారం చేయడంలో ఓడిపోయారని, వారి సోషల్ మీడియా వ్యూహాలు ఓట్లుగా మారలేదని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం కొందరు సోషల్ మీడియా ఆధారిత రాజకీయ ఆకర్షణగా చూస్తున్నారు, మరికొందరు దీనిని రాజకీయ స్నేహానికి సంకేతంగా భావిస్తున్నారు. "నేను విన్నాను? నేను ఉన్నాను" డైలాగ్ జగన్ రాజకీయ ఇమేజ్‌కు సినిమాటిక్ ఆకర్షణను జోడించింది. ఈ డైలాగ్ మొదట "యాత్ర" సినిమాలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి చెప్పగా, జగన్ తన పాదయాత్రలో దీనిని రాజకీయ నినాదంగా మార్చారు. ఈ డైలాగ్ 2022లో మహేష్ బాబు నటించిన ''సర్కారు వారి పాట'' సినిమాలో కూడా ఉపయోగించబడింది, దీనిపై వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు. కేటీఆర్ ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా, జగన్ యొక్క రాజకీయ, సాంస్కృతిక ప్రభావాన్ని తెలంగాణ సందర్భంలో ఉపయోగించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తుంది. ఈ డైలాగ్ యొక్క సినిమాటిక్, రాజకీయ నేపథ్యం దానిని సోషల్ మీడియాలో వైరల్‌గా మార్చడానికి దోహదపడింది. ఇక ఇప్పుడు



ఎవరినీ వదిలి పెట్టం.. విదేశాల్లో ఉన్నా పట్టుకొస్తా.. అంటూ కేటీఆర్ జగన్ డైలాగులు చెబుతున్నారు. ఇప్పుడు నేతలు చెబుతున్న డైలాగులన్నీ అధికారులను బెదిరించేందుకే. కేసీఆర్ సర్కారే దీనికి మొదట తెరతీసింది. ఏపీలో జగన్ కూడా అధికారులను రాజకీయాలకు వాడుకున్నారు. అధికారం కోల్పోగానే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, టీడీపీ అదే పనిచేస్తున్నాయి. దీంతో ఇప్పుడు ప్రతిపక్ష నేతలు గగ్గోలు పెడుతున్నారు. అధికారులను తమ దారికి తెచ్చుకునేందుకే ఇలాంటి డైలాగులు కొడుతున్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి.

బేతంచర్ల,మొక్కలు నాటి కాలుష్యం నుండి పర్యావరణాన్ని రక్షించాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. గురువారం నాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బేతంచర్ల లోని కొత్త బస్టాండ్ నంద్యాల సర్కిల్ వద్ద నగర పంచాయతీ సిబ్బంది, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ నిర్వహించారు అనంతరం ఎంపీడీవో ఫజల్ రెహమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని నివారించడానికి తమ వంతుగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదుపు మహిళలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# గులాబీలో దెయ్యాలు మాయమైనట్టేనా

హైదరాబాద్, జూన్ 5,

ఃఖీూ పార్టీలో ఏం జరుగుతోంది. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో ఏం జరగబోతోంది. కవిత విషయంలో నెక్ట్స్ ఏంటి.. షోకాజ్ నోటీసులు ఇస్తారా.. ఇవ్వరా.., కవితపై చర్యలు తీసుకుంటారా లేదా.. ఇంతకీ కవిత కొత్త పార్టీ పెడుతుందా.. ఇలా ఎన్నో ప్రశ్నలు .. ఇన్నాళ్లు లక్షలాది మెదళ్లను కదిలిస్తూనే ఉన్నాయి. కానీ తాజాగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే..ఈ ప్రశ్నలకు సమాధానం మాత్రం దొరకదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.మే 2 వతేదిన బీఆర్ ఎస్ పార్టీ అధినేత, తన తండ్రి కేసీఆర్ కు ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత లేఖరాశారు. మైడియర్ డాడీ అంటూ మొదలుపెట్టి, మీరు అలా మాట్లాడటం బాగుంది, కానీ ఇలా కూడా మాట్లాడవలసింది. బిజెపితో దోస్తీ అనే అనుమానం రాకుండా విమర్శల డోస్ పెంచాల్సింది. అంటూ బిఆర్ఎస్ వరంగల్ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగంపై , పార్టీలో అనుమానాలు , కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయంపై లేఖలో వివరిస్తూ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు..మే 22వ తేది.. సరిగ్గా లేఖ రాసిన ఇరవైరోజుల తరువాత కవిత రాసిన లేఖ లీకైయ్యింది. మీడియా చేతికి కవిత తండ్రికి రాసిన సీక్రెట్ లేఖ చిక్కింది. ఇంకేముంది వరుస కథనాలతో మీడియా హోరెత్తించింది. పార్టీలో ఇన్నాళ్లు గుట్టుచప్పుడుకాకుండా ఉన్న లోపాలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. మే 23వ తేది.. అమెరికా పర్యటన తిరుగు ప్రయాణంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న కవిత మీడియాతో మాట్లడారు. తాను రాసిన లేఖ లీక్ పై ప్రశ్నించిన మీడియా సైతం అవక్కాయ్యేలా సొంత పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. తన తండ్రి కేసీఆర్ దేవుడు అంటూ మొదలుపెట్టి, ఆయన చుట్టూ కొన్ని దెయ్యాలున్నాయి, పార్టీ నుండి కోవర్టులను బయటకు పంపాలి. తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.మే 29వ తేది.. నేను జైలులో ఉన్నప్పుడు బిజెపిలో బిఆర్ ఎస్ విలీనం చేసేందుకు సిద్దమైయ్యారు. ఆ ప్రయత్నాన్ని నేనే అడ్డుకున్నానంటూ తెలంగాణ రాజకీయాల్లో గ్రానేడ్ పేల్చింది. నా జోలికొస్తే బాగోదు. నాపై విదేశాల నుండి బీఆర్ ఎస్ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారంటూ మీడియా చిట్ చాట్ లో తీవ్ర పదజాలంతో సొంత పార్టీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు కవిత. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే స్పందించలేదు కానీ, మరో నేతకు నోటీసులు ఇస్తే నానా హంగామా చేస్తారా అంటూ నేరుగా అన్న కేటీఆర్, బావ హరీష్ రావులను టార్గెట్ చేశారు.ఇదే చివరిగా బీఆర్ ఎస్ పార్టీపై కవిత చేసిన విమర్శలు. నేరుగా మీడియా కెమెరాల ముందు ఓసారి, చిట్ చాట్ పేరుతో మరోసారి సొంత పార్టీలో పరిణామాలపై విరుచుకుపడిన కవిత, ఆ దెయ్యాల వల్లే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ధిక్కార స్వరంతో మాట్లాడిన కవిత. ఆ తరువాత మూడు సార్లు మీడియా సమావేశాల్లో మాట్లాడినా, ఎక్కడా పార్టీ ఊసే తేలేదు. దెయ్యాల విషయం తేల్చాలంటూ ప్రశ్నించలేదు. లేఖ లీకు వీరుల మాటెత్తలేదు. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేనట్లుగా మే 31వ తేది తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ప్రారంభించారు. కేసీఆర్ కు కాళేశ్వరంపై నోటీసులు ఇవ్వడం అంటే తెలంగాణకు నోటీసులు ఇవ్వడమేనంటూ, ఈనెల 4వ తేదిన మహాధర్నాకు పిలుపునిచ్చారు.ఇలా పార్టీపై తీవ్ర ధిక్కార స్వరంతో మే 23వ తేదిన మొ?దలైన కవిత ఎపిసోడ్ కు కేవలం ఆరే ఆరు రోజుల్లో గతనెల 29వ తేదితో బ్రేక్ పడింది. ఈ బ్రేక్ తాత్కాలికమా లేక శాశ్వతమా అనేది క్లారిటీ లేదుకానీ ,ఒక్కటైతే స్పష్టమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. అంతన్నారింతన్నారే.. అన్నట్లుగా కవిత వ్యాఖ్యలతో బిఆర్ ఎస్ లో లీకు వీరులపై చర్యలు తీసుకుంటారు, లేదా కవితకు షోకాజ్ ఇస్తారు అనే ప్రచారం జరిగింది. వడ్డించేవాడు మనవాడైతే.. బంతిలో చివరిన కూర్చున్నా అన్నీ అందుతాయనే సామతే ఉండేనే ఉంది. అచ్చం ఆ సామెతను తలదన్నేలా ., కవిత ఎపిసోడ్ ముగిసిందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. చిట్ చాట్ లో మాట్లడిన మాటలపై షోకాజ్ ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చు. కానీ శంషాబాద్ ఎయిర్ పోర్టు సాక్షిగా మీడియా కెమెరాల ముందు కేసీఆర్ చుట్టూ దెయ్యాలు అంటూ పార్టీ పరువు పోయేలా మాట్లడారు కవిత. కేసీఆర్ ను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ అధినేత పార్టీ నడుపుతున్న తీరునే ప్రశ్నించారు. ఇలా పార్టీ లైన్ దాటినా మరి షోకాజ్ ఎందుకు ఇవ్వలేదనేవారు లేకపోలేదు. అదే మరో నేత బిఆర్ ఎస్ కవితలా విమర్శలు చేస్తే పార్టీ నుండి సాగనంపి వారం దాటేది అన్నవారు లేకపోలేదు. బిఆర్ ఎస్ పార్టీలో తన తండ్రి చుట్టూ దెయ్యాలున్నాయి అంటూ మొదలైన కవిత ఆగ్రహం, తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ఏర్పాటుతో వేరు కుంపటి పెట్టడం, కేసీఆర్ కు జాగృతి రెండో కన్ను అనడం, జాగృతీ జిల్లా నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో బీఆర్ ఎస్ కు దూరమైయ్యారు.తాజాగా మరో అడుగు ముందుకేసి బీఆర్ ఎస్ బాస్ నోటీసులకు నిరసనగా, బీఆర్ ఎస్ చేయాల్సిన నిరసనలు తాను బుజానకెత్తుకుని, జాగృతి ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునివ్వడం చూస్తుంటే, బీఆర్ ఎస్ లో కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలను జాగృతీ మంత్రంతో వదిలించినట్లయ్యిందనే విమర్శలొస్తున్నాయి. సొంత కుంపటి కోసం ఇంత రాద్దాంతం అవసరమా అనే వాదనలు విపిస్తున్నాయి.

# రేషన్... పరేషాన్...

కరీంనగర్, జూన్ 5,

సన్నబియ్యానికి తెలంగాణలో డిమాండ్ పెరిగింది. తెలంగాణలో రేషన్ షాపుల ముందు ప్రజలు బియ్యం తీసుకోవడానికి పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడలేక సంచులు, చెప్పులు పెడుతున్నారు. ఒక వ్యక్తికి రేషన్ ఇచ్చేందుకు దాదాపు 30 నిమిషాల సమయం పడుతుందని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడంతో ఉదయం ఆరు గంటల నుంచే క్యూలో నిల్చొని, సర్వర్ ప్రాబ్లం ఉండడంతో గంటల తరబడి క్యూ లైన్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎందుకు ఆలస్యమవుతుందని రేషన్ డీలర్ లను నిలదీయగా, సర్వర్ ప్రాబ్లం ఉందని సాంకేతిక నిపుణులు వచ్చి సరి చేసేవరకు ఏం చేయలేమని సమాధానం ఇస్తున్నారు. కూలి పనులు, ఉద్యోగాలు మానుకొని లైన్ లో నిలుచుంటున్నామని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇచ్చేముందు సాంకేతిక లోపాలను సరిచేసుకోవడం తెలియదా అంటూ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రేషన్ ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. రేషన్ దుకాణాల్లో తెలుపు రంగు రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో ప్రజలు హ్యాపీ ఫీలవుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చేటప్పుడు ఇంతటి రష్ ఉండేది కాదని రేషన్ దుకాణాల డీలర్లు చెబుతున్నారు. చాలా వరకూ బియ్యాన్ని తీసుకునే వారు కాదని, కొందరు తీసుకున్న బియ్యాన్ని బయట వ్యాపారులకు విక్రయించే వారని చెబుతున్నారు.సన్న బియ్యం కావడంతో... సన్న బియ్యం కావడంతో అందులోనూ ఉచితంగా ఇవ్వడం, ఇంట్లో ఎంత మంది ఉన్నప్పటికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తుండటంతో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. తెలంగాణలో మొత్తం 90 లక్షలకు పైగా రేషన్ కార్డులున్నాయి. అందులో మూడుకోట్ల మందికి సన్నబియ్యాన్ని తెలంగాణ ప్రభుత్వం అందిస్తుంది. ప్రతినెల రేషన్ దుకాణాలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తుంది. ఎక్కడా బియ్యం కొరత అంటూ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డులు వస్తే మరో ముప్ఫయి లక్షల మంది లబ్దిదారులు పెరిగే అవకాశముంటున్నారు. ఈ సన్నబియ్యం పథకం కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం 10,615 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. అందులో రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేలకోట్ల రూపాయలను ఖర్చుచేస్తుంది. అదనంగా ప్రభుత్వం పై మూడు కోట్ల రూపాయలు భారం పడినప్పటికీ గతంలో అరవై శాతం మంది మాత్రమే రేషన్ బియ్యం తీసుకునే వారని, ఇప్పుడు వందశాతం మంది తీసుకోవడం పథకం సూపర్ సక్సెస్ అయిందని చెప్పడానికి ఉదాహరణ అని ప్రభుత్వ వర్గాలు అందనున్నాయి. ఇదే సమయంలో మూడు నెలల పాటు భారీ వర్షాలు, వరదలు ఉంటాయని భావించి మూడు నెలలకు ఒకేసారి సన్న బియ్యం ఇస్తుండటంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. అందుకే రేషన్ దుకాణాల వద్దకు క్యూ కడుతున్నారు. అనేక చోట్ల రద్దీ ఎక్కువగా ఉండటంతో బియ్యం తీసుకునేందుకు ఎక్కువ సమయంపడుతుంది.

# నోటరీ ప్రాపర్టీ కొన్నారో... అంతే సంగతులు

హైదరాబాద్, జూన్ 5,

హైదరాబాద్ నగరంలో నోటరీ స్థలాల కొనుగోళ్లు సర్వసాధారణం. అయితే అటువంటి స్థలాలకు నిర్మాణ అనుమతులు పొందడంలో కొనుగోలుదారులు తరచుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. నోటరీ స్థలాలకు పూర్తిస్థాయి చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు ఉండవు. కేవలం నోటరీ పత్రం ద్వారా అమ్మకందారునికి, కొనుగోలుదారునికి మధ్య లావాదేవీని ధృవీకరించినట్లు మాత్రమే అవుతుంది. ఇది రిజిస్టర్డ్ డాక్యుమెంట్ మాదిరిగా పటిష్టమైన చట్టపరమైన ఆధారం కాదు. కాబట్టి వీటి భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతులు వంటివి మంజూరు చేయడానికి నిరాకరిస్తాయి. తాజాగా నోటరీ స్థలాల నిర్మాణ అనుమతలుపై హైదరాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారులు కీలక ప్రకటన చేశారు.హైదరాబాద్ నగరంలో నోటరీ పత్రాలతో కొనుగోలు చేసిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఎదురవుతున్న సమస్యలపై ప్రధాన కార్యాలయంలో జరిగిన పాలకమండలి సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది. ఈ వివాదం ఒక ఆత్మహత్య కేసు తో ముడిపడి ఉండటంతో సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ ఫిర్యాదుతో టౌన్‌ప్లానింగ్ అధికారులు బీఆర్‌ఎస్ కార్యకర్త సర్దార్ సింగ్ ఇంటిని ఏకపక్షంగా సీజ్ చేశారని, దాంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సభలో చర్చ ప్రారంభించారు. ఈ ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారని, బాబా ఫసీయుద్దీన్ పాత్ర ఉందా? లేదా అనే విషయం విచారణలో వెలుగు చూస్తుందని వారు పేర్కొన్నారు.నోటరీ స్థలాలకు నిర్మాణ అనుమతులు ఇవ్వకపోవడంపై సభలో ప్రశ్నించినప్పుడు.. నగర ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం రిజిస్టర్డ్ సేల్ డీడ్ ఉన్న స్థలాలకు మాత్రమే నిర్మాణ అనుమతులు మంజూరు చేయగలమన్నారు. నోటరీ స్థలాలకు అనుమతులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ వివరణపై మేయర్ విజయలక్ష్మితోపాటు పలువురు కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు అనుమతిచ్చే అధికారం లేనప్పుడు పేదల ఇళ్లను కూల్చే అధికారం కూడా లేదని మేయర్ విజయలక్ష్మి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇది అధికారుల తీరుపై ప్రజలు, ప్రజాప్రతినిధుల్లో ఉన్న అసంతృప్తిని స్పష్టం చేసింది.హైదరాబాద్‌లో వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు తక్కువ ధరలకు లభిస్తున్నాయని నోటరీ స్థలాలను కొనుగోలు చేస్తుంటారు. అయితే, వీటిని చట్టబద్ధం చేయకపోవడం, నిర్మాణ అనుమతులు లభించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ వంటి పథకాలు ప్రవేశపెట్టినా అవి పూర్తిగా సమస్యను పరిష్కరించలేకపోయాయి. ఈ అంశంపై భవిష్యత్తులో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరగబోతోంది

హైదరాబాద్, జూన్ 5, (

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అద్భుతమైన ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనమని చాలామంది భావిస్తారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అవినీతి, నాణ్యతా లోపాలకు నిలయంగా ఆరోపిస్తోంది. ఈ ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి అని గులాబీ నేతలు అంటుంటే, ఇది మొత్తం అవినీతిమయం అని హస్తం నేతలు విమర్శిస్తున్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడంతో, ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలున్నాయని, డిజైన్‌లో తప్పులున్నాయని, అంచనాలు పెంచేశారని, భారీగా అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం మార్చి 2024లో ఒక జుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఏకసభ్య కమిషన్‌గా ఏర్పాటు చేయబడిన దీనికి మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అధిపతిగా వ్యవహరిస్తున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రధాన ఆరోపణలు

మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం, పంపుహౌస్‌లు మునిగిపోవడం వంటి సంఘటనలు ప్రాజెక్టు డిజైన్‌లో, నిర్మాణంలో తీవ్రమైన లోపాలను ఎత్తిచూపుతున్నాయి.

ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రారంభంలో వేల కోట్ల రూపాయలు ఉండగా, అది లక్ష కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. ఇందులో అవినీతి జరిగిందన్న ఆరోపణలున్నాయి.

నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలుఉన్నాయని, తక్కువ నాణ్యత కలిగిన సామగ్రిని ఉపయోగించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఇందులో ముఖ్య నేతలకు లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ పాత్రపై విచారణ

తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలోనే ఈ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. ఆయనే స్వయంగా ఈ ప్రాజెక్టును ఒక ఇంజినీర్‌గా రూపొందించారన్న ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం సహా అన్ని విషయాల్లో కేసీఆర్ కీలకపాత్ర పోషించారన్నది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భావన. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం, అంచనాల పెంపు, నిధుల్లో అవినీతి వంటి వాటిపై విచారణ జరిపేందుకు కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని మొదట నోటీసుల్లో పేర్కొంది. అయితే, కేసీఆర్ విజ్ఞప్తి మేరకు కమిషన్ విచారణ తేదీని జూన్ 11కు మార్చింది. ప్రాజెక్టు రూపకల్పన దశ నుండి ప్రాజెక్టు ప్రారంభం వరకు జరిగిన అన్ని అంశాలపై కేసీఆర్‌ను కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్ణయాలు, పర్యవేక్షణ వంటి అంశాల్లో ఆయన పాత్రపై ఆరా తీయనుంది.తెలంగాణ ఏర్పడిన తొలి ప్రభుత్వంలో హరీశ్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణ పనుల పర్యవేక్షణ, అంచనాల పెంపు, పర్యవేక్షణ లోపాలు, మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం వెనుక గల కారణాలు, నిధుల్లో అవకతవకల ఆరోపణలు వంటి అంశాలపై కాళేశ్వరం కమిషన్ విచారణ జరపనుంది. జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు జారీ చేసింది. ప్రాజెక్టు అమలులో మాజీ మంత్రి హరీశ్ రావు పాత్ర, ఆయన నిర్ణయాలు, బాధ్యతలపై కమిషన్ దృష్టి సారించనుంది.కేసీఆర్ తొలి కేబినెట్‌లో ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, వ్యయ అంచనాలు, ఆర్థిక శాఖ అనుమతుల జారీ, నిధుల పంపిణీ, బడ్జెట్ కేటాయింపులు, ఆర్థిక అవకతవకలపై ఆరోపణలు వంటి అంశాలపై విచారణకు ఈటల రాజేందర్‌ను కమిషన్ ప్రశ్నించనుంది. జూన్ 6వ తేదీన విచారణకు హాజరు కావాలని కాళేశ్వరం కమిషన్ నోటీసుల్లో పేర్కొంది.కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ విచారణ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మాజీ సీఎం కేసీఆర్ కమిషన్ ఎదుట హాజరు కావాలని నిర్ణయించుకోవడం ఇప్పుడు మరింత చర్చకు దారితీసింది.

# నూర్ భాష దూదేకుల సంఘనీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

బేతంచర్ల,

:నూర్ భాష దూదేకుల సంఘం మరియు సాయి కంప్యూటర్స్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను నిర్వహిస్తున్నట్లు సాయి కంప్యూటర్స్ ట్రైనింగ్ సెంటర్ అధినేత దస్తగిరి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేతంచర్ల మండలంలోని నూర్ బాషా దూదేకుల నిరుద్యోగ యువతీ యువకులు మరియు ముస్లిం నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని దరఖాస్తు చేసుకోవడానికి పదవ తరగతి పాసైన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని, దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థి యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పదవ తరగతి మార్కుల జాబితా, పాస్ ఫోటోతో బేతంచర్ల పట్టణంలోని రెడ్డి హోటల్ ఎదురుగా ఉన్న సాయి కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ నందు సంప్రదించాలని మిగతా వివరాలకు 9603437726 నంబర్ను సంప్రదించాలని కోరారు.

# అనంతవరంలో చంద్రబాబు, పవన్ పర్యటన

అనంతవరం

ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. . రాజధాని ప్రాంతం అనంతవరంలోని ఏడీసీఎల్ పార్కో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టాల్స్ ను సందర్శించారు. తరువాత వన మహోత్సవ సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రసంగించారు.



# సిరాజ్ నెట్ వర్క్ పై ఫోకస్

హైదరాబాద్, జూన్ 5, (న

విజయనగరం బాంబు పేలళ్ల కుట్ర కేసులో మరికొన్ని పేర్లు బయటకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటలిజెన్స్ తో పాటు ఎన్ఐఏ అధికారుల విచారణలో మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. విజయనగరంతో పాటు హైదరాబాద్, వరంగల్, బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో బాంబ్ బ్లాస్ట్ లు చేయడానికి ప్లాన్ వేసిన సిరాజ్ గ్యాంగ్ కు పేలుడు పదార్థాల కొనుగోలుకు సంబంధించిన నిధులు ఇమ్రాన్ అక్రమ్ పంపినట్లు తేలింది. ఇమ్రాన్ అక్రమద్ హైదరాబాద్. అయితే ఇమ్రాన్ సౌదీలో సెటిలయ్యాడు. సిరాజ్ ఏర్పాటు చేసిన అహీం గ్రూపునకు సంబంధించి ఆకర్షితుడైన ఇమ్రాన్ ఎంత డబ్బులు అయినా పేలుడు సామగ్రి కొనుగోలుకు పంపుతానని సిరాజ్ తో చెప్పినట్లు తేలింది. ఇమ్రాన్ అక్రమ్ సిరాజ్ కు సౌదీ లో ఉండి ఆర్థిక సహకారం అందించగా, వరంగల్ కు చెందిన ఫర్హాన్ మొహియుద్దీన్ తో పాటు ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన బదర్ తో పాటు మరికొందరు సిరాజ్ గ్యాంగ్ లో యాక్టివ్ గా ఉన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. గత ఏడాది చివరలో ముంబయి, ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీకి వెళ్లిన సిరాజ్ పలువురిని కలిశారు.అద్నార్ ఖురేషీ, దిల్షన్, మోషిన్ షేక్, జస్సీర్, షమద్, అమీర్ అన్సారీలో సిరాజ్ భేటీ అయి మాట్లాడినట్లు కౌంటర్ఇంలిజెన్స్ అధికారులు, ఎన్ఐఏ అధికారులు తేల్చారు. వారితో సిరాజ్ ఏం మాట్లాడారు? వారిని సిరాజ్ ఎలా ఉపయోగించుకోవాలనుకున్నాడు? అన్న దానిపైనే ప్రస్తుతం అధికారులు దర్యాప్తు కొనసాగుతుంది సిరాజ్, సమీర్ ల కదలికలను ముందుగా గుర్తించడంతో బాంబుపేలుళ్ల కుట్ర భగ్నమయింది. ఈ ఇద్దరికి అన్ని రకాలుగా సహకారం అందించిన వారిపైనే ఇప్పుడు ఎన్ఐఏ అధికారులు ఫోకస్ పెట్టారు. ఇంకా ఎవరెవరి ఖాతాలో నిధులు ఏమైనాజమ అయ్యాయా? సిరాజ్ తో పాటు ఇంకా ఎవరైనా పేలుడు పదార్థాలు కొనుగోలు చేశారా? అన్న కోణంలో ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరం పోలీసులు నమోదు చేసిన ఈ కేసును ఎన్ఐఏ అధికారులు తీసుకుని దేశ వ్యాప్తంగా సిరాజ్ నెట్ వర్క్ ను ఛేదించాలన్న భావనలో ఉన్నారు. విదేశీ హ్యాండర్లను గుర్తించడంతో పాటు దేశంలోని పలు ప్రాంతంలో ఉన్న స్లీపర్ సెల్స్ ను తమ కస్టడీలోకి తీసుకోవడం ద్వారా మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశముందని ఎన్ఐఏ అధికారులు భావిస్తున్నారు

# వరంగల్ మహాకాళి ఆలయానికి మహర్దశ

వరంగల్, జూన్ 5,

వరంగల్‌లోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయాన్ని గొప్ప క్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని రాష్ట్ర దేవాదాయ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా రూ.20 కోట్లతో ఆలయానికి నాలుగు వైపులా రాజగోపురాలు నిర్మిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. బుధవారం భద్రకాళి వేద విద్యాలయం నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి ఈ విషయాలు వెల్లడించారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తామని, కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో ఉన్న దేవాలయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆమె పేర్కొన్నారు. కొత్తగా 14 ఆలయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇప్పటికే రూ.30 కోట్లతో భద్రకాళి ఆలయం చుట్టూ మాడవీధుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాదాయశాఖ స్థలంలో ఆలయ సంబంధిత పనులు చేపడుతుంటే అభ్యంతరాలు తెలపడం సరికాదన్నారు. అంతకుముందు, ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.వరంగల్ నగరానికి వాయువ్య దిశలో ఉన్న భద్రకాళి దేవాలయం కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన పురాతన, శక్తివంతమైన ఆలయాల్లో ఒకటి. సుమారు 625 ంఆలో చాళుక్యులచే నిర్మించబడి ఆ తర్వాత కాకతీయ చక్రవర్తులు దీనిని పునరుద్ధరించారని చరిత్రకారులు పేర్కొంటారు. ఈ ఆలయంలో కొలువైన భద్రకాళి అమ్మవారు ఉగ్రరూపంలో దర్శనమిస్తారు. అమ్మవారి విగ్రహం అద్భుతమైన శిల్పకళతో చెక్కబడిన ఏకశిలారూపం. ఆలయం పక్కన ఉన్న భద్రకాళి చెరువు ఆలయ ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. ఈ చెరువు కాకతీయుల కాలంలో వ్యవసాయానికి, తాగునీటికి ప్రధాన వనరుగా ఉండేది. ఈ ఆలయం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తుంది. దేవీ శరన్నవరాత్రులు, దసరా వంటి పండుగలకు ఇక్కడ ప్రత్యేక పూజలు, ఉత్సవాలు జరుగుతాయి. వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి అమ్మావారి ఆశీస్సులు పొందుతారు. ప్రధాని మోదీ సహా.. పలువురు ప్రముఖులు ఈ ఆలయాన్ని సందర్శించారు. ఈ ఆలయం కాకతీయ వైభవాన్ని, నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తుంది.

# నేడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం

మైదుకూరు (బ్రహ్మంగారిమఠం )మైదుకూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణములో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు మైదుకూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్గా ఎ పి రవీంద్ర ప్రమాణ స్వీకారోత్సవం మైదుకూరు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి బాబు ప్రకటన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు చైర్మన్గా పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగాంఖ రవీంద్ర స్వగృహం నుండి బయలుదేరి శ్రీకృష్ణదేవరాయల కూడలిలో మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ గారి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారన్నారు.తదనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐదు ఇప్పుడు మార్కెట్ యార్డ్ చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు అనంతరం భోజన కార్యక్రమం కలదన్నారుఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు, కూటమి నాయకులు, కౌన్సిలర్ లు, సర్పంచ్ లు, టీడీపీ కార్యకర్తలు, తెలుగుదేశం కుటుంబ సభ్యులు, అభిమానులు ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరుకుంటున్నామన్నారు

# ఎంపీగా రఘురాం రెడ్డి ఏడాది పూర్తయిన సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

## -రక్తదానం చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, జూన్ 5: ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి తన ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో తల సేమియా చిన్నారుల కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ రక్తదానం చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రధాన అనుచరుల్లో ఒకరిగా ఉన్న ఉమ్మినేని కృష్ణ గతంలో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అదే విధంగా పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా పలుమార్లు రక్తదానం చేశారు. అంతేకాక అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం, శస్త్ర చికిత్సల నిమిత్తం పేదలు ఎవరైనా ఆసుపత్రిలో ఉన్నారని తెలిసిన వెంటనే రక్తం అవసరం పడితే వెంటనే ఆసుపత్రికి వెళ్లి రక్త దానం చేయడం ఆయనలో ఉన్న గొప్పతనం. ఎంపీ ఏడాది పాల సందర్భంగా నిర్వహించిన



రక్తదాన శిబిరంలో ఆయన అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని రక్త దానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కోటా రాంబాబు, ఎడ్లపల్లి సంతో బాలసాని లక్ష్మీనారాయణ, మిక్కిలి నేని నరేందర్, మంజుల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పొంగులేటి కార్యాలయం ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, కూరపాటి ప్రదీప్, మున్సిపల్ చైర్మన్ నీరజ, నల్లమల వెంకటేశ్వరావు, బేబీ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# నేడు జాబ్ మేళా నిర్వహణ: జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), జూన్ 05:ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు నేడు (జూన్ 6న) శుక్రవారం ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లో బ్రాంచ్ మేనేజర్, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ సర్వీస్ మేనేజర్ సంబంధిత ఖాళీల ఉద్యోగాలకు 18 నుండి 35 సంవత్సరాల వయస్సు, ఇంటర్, డిగ్రీ అర్హత గల పురుష అభ్యర్థులు అర్హులని, ఇట్టి ఉద్యోగ ఖాళీలు ఖమ్మం, సూర్యాపేట జిల్లాల యందు ఉన్నాయని, ఎంపికైన వారికి వేతనం 15 వేల నుండి 35 వేల వరకు ఉంటుందని తెలిపారు.మొత్తం 54 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గుమ్మడిదల మున్సిపాలిటీలో వార్డ్ విభజనపై అభ్యంతరం

## అఖిలపక్ష సమావేశం నిర్వహణకు డిమాండ్

గుమ్మడిదల, భారత శక్తి ప్రతినిధి, జూన్ 5 :గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం గ్రామాలను కలిపి ఇటీవల ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో, వార్డ్ విభజన సక్రమంగా జరగలేదని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.మాజీ జడ్పిటిసి సభ్యుడు కుమార్ గౌడ్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ రఘుకు వారు వినతిపత్రం అందజేశారు.గ్రామాల పరంగా సరైన వార్డ్ విభజన జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతి గ్రామానికి సంబంధిత వార్డులను, గ్రామాలను వరుస పద్ధతిలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.వార్డ్ విభజనపై చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలను పిలిచి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు.ఈ



కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులు, యాదవ్ కుంటి మల్లేష్, రఘు గౌడ్, కుంటి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నాకో ప్లేస్ ఇవ్వండి... నేనూ ఆడతా...!

## - కూసుమంచి మండలం నర్సింహులగూడెంలో పొంగులేటి ఆటవిడుపు

## - విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడిన మంత్రి

## - ఆట అనంతరం కాసేపు ఆటగాళ్లతో మాటముచ్చట..

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), జూన్ 05:ఏరా పిల్లలు.... వాలీబాల్ ఆడుతున్నట్టునారు.... నాకో ప్లేస్ ఇవ్వండి.... నేనూ ఆడతా అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులతో కాసేపు ఆట ఆడారు. కూసుమంచి మండల పర్యటనలో భాగంగా గైగోల్లపల్లి గ్రామానికి వెళ్ళి... తిరుగు ప్రయాణంలో పాలేరు గ్రామానికి వస్తున్న సమయంలో మార్గంమధ్యలోని నర్సింహులగూడెం గ్రామంలోని మైదానంలో వాలీబాల్ ఆడుతూ కనిపించిన విద్యార్థులను చూసి తన కాన్వాయ్ ను ఆపారు. నేనూ ఆడతా... నాకో ప్లేస్ ఇవ్వండి అంటూ కాసేపు వారితో కలిసి వాలీబాల్ ఆడారు. ఆట అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. ఒక్కొక్క విద్యార్థిని పలకరించి ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు కూసుమంచిలో మంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని... నాణ్యమైన విద్యను అందిస్తామని దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చదువుకోవాలని సూచించారు. డ్రగ్స్ కు యువత బానిస అవ్వొద్దని... విక్రయాలు జరిపే వారి వివరాలు తెలిసినా... డ్రగ్స్ కు బానిసైన వారు ఎవరైనా ఉన్నా తన దృష్టికి తీసుకుని రావాలని వారితో అన్నారు. చదువుతో పాటు ఆట కూడా ముఖ్యమని చెప్పి కొత్త వాలీబాల్... క్రికెట్ కిట్ కొనుక్కోమని వాటికి



అయ్యే ఖర్చుకు నగదును టీమ్ సభ్యులకు అందించారు. స్వయంగా మంత్రే వచ్చి వారితో వాలీబాల్ ఆడటంతో అక్కడి విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.



# జూన్ 17 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలి: ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), జూన్ 05:జూన్ 17 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నందు 3వ, 5వ, 8వ తరగతుల ప్రవేశం కొరకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

2025-26 సంవత్సరానికి ఖమ్మం జిల్లాకు చెందిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో అర్హులైన గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ప్రవేశం అందిస్తున్నామని, 3వ తరగతి విద్యార్థులకు (29) సీట్లు, 5వ తరగతి విద్యార్థులకు (14) సీట్లు, 8వ తరగతి విద్యార్థులకు (14) సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశ దరఖాస్తు గడువు జూన్ 17 తో ముగుస్తుందని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జూన్ 20న ప్రాజెక్టు అధికారి అధ్యక్షతన ఐటీడీఏ భద్రాచలం ఆఫీసు నందు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను తరగతి వారీగా లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేయు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో లక్ష యాభై వేల రూపాయల లోపు ఉండాలని అన్నారు.దరఖాస్తుకు కుల, నివాస ధృవీకరణ పత్రం, గత సంవత్సరం చదివిన పాఠశాల స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు జత చేయాలని, ఆసక్తి గలవారు జూన్ 17 సాయంత్రం ఐదు గంటల లోపు ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం, రూమ్ నెంబర్ ఎస్ - 30, జిల్లా కలెక్టరేట్ ఖమ్మం నందు దరఖాస్తులను సమర్పించాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కాలేజీలో అడ్మిషన్కు వెళ్తుండగా యాక్సిడెంట్: తండ్రీకొడుకు లు మృతి

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), జూన్ 05:ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండ గ్రామ మాజీ సర్పంచ్ భర్త ఆజ్మీర బాల్య,(50) అయన కుమారుడు సాయి కుమార్ (18) లు మృతి చెందారు. దుబ్బతండాకు చెందిన బాల్య (50), అతడి కుమారుడు సాయికుమార్ను ఓ ఇంటర్ కాలేజీలో చేర్పించేందుకు ఖమ్మం వచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ క్రాస్ చేస్తుండగా ఓ లారీ వేగంగా వచ్చి వారిని ఢీకొట్టడంతో తండ్రీకొడుకు లు అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం




ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 24 గంటల్లోనే దోపిడీ కేసును చేధించిన వేములవాడ పోలీసులు

## ఇద్దరు నిందుతులు అరెస్ట్ , రిమాండ్ కి తరలింపు.

## 9 గ్రాముల బంగారం,ఒక కత్తి, ఆటో, రెండు సెల్ ఫోన్స్ స్వాధీనం.

## వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ వీరప్రసాద్.





ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో సయ్యద్ అలీ, వేములవాడ,జూన్ 05(భారత శక్తి): దొంగతనం జరిగిన 24గంటల్లోనే నిందితులను చాకచక్యంగా గుర్తించి, కటకటాల్లోకి పంపారు వేములవాడ పట్టణ పోలీసులు.ఈ మేరకు వేములవాడ సీ.ఐ వీరప్రసాద్ దోపిడీ చేసిన వివరాలు వెల్లడించారు.ఈనాయత్ నగర్ గ్రామం కమ్మర్పల్లి మండలం నిజామాబాద్ జిల్లాకు చెందిన బడవత్ తిమ్మి భర్త మనోహర్,అనే మహిళ జూన్ 1వ ఆదివారం రోజున వేములవాడ దైవదర్శనానికి రాత్రి సుమారు 7:30 గంటలకు రాగా, తిప్పాపూర్ బస్టాండ్ ముందు ఆటో స్టాండ్ వద్ద ఒక వ్యక్తి నిలబడి ఆమెను మీ బంధువులు గుడి వద్ద ఉన్నారని నాకు తెలుసని మిమ్మల్ని గుడి వద్దకు తీసుకు వెళ్తానని మాయమాటలతో నమ్మించి ఆమెను తన ఆటోలో ఎక్కించుకొని వేములవాడలోని చెక్కపల్లి రోడ్డులో గల పెద్దమ్మ టెంపుల్ ప్రాంతానికి తీసుకువెళ్లి, అక్కడ ఎవరు లేని సమయంలో ఆమెను కత్తితో బెదిరించి ఆమె మెడలో నుండి బంగారు ఆభరణాలైన 3 గ్రాముల పుస్తెలు,4 గ్రాముల చెవి కమ్మలు,2 గ్రాముల మాటీలు,ఒక గ్యారెంటెడ్ చైను, పరుసులో ఉన్న నగదు డబ్బులు సుమారు 3000 రూపాయలు ఆమె నుండి దోపిడీ చేసుకొని పారిపోగా, తేదీ జూన్ మూడవ తేదీ మంగళవారం రోజున బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా జూన్ 4 బుధవారం రోజున సంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడు అయిన బోదాసు అశోక్ గ్రామం ఎల్లంపేట, కామారెడ్డి అను నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా అట్టి దోపిడి చేసిన బంగారు ఆభరణాలను కొన్ని తనవద్ద ఉంచుకొని మిగతావి తన స్నేహితుడు అయిన బొమ్మిడి గణేష్ వద్ద దాచి పెట్టినానని తెలుపగా ఇద్దరు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 3 గ్రాముల పుస్తెలు,4 గ్రాముల చెవి కమ్మలు, 2 గ్రాముల మాటీలు,ఒక రోల్డ్ గోల్డ్ చైన్, ఒక కత్తి, రెండు సెల్ ఫోన్లు, ఒక ఆటో స్వాధీన పరుచుకొని నిందితులను రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. చాకచక్యంగా నిందితులను 24 గంటలలో పట్టుకున్న వేములవాడ సీఐ వీరప్రసాద్,హెడ్ కానిస్టేబుల్ లత,కానిస్టేబుల్ లు గోపాల్, సమీయుద్దీన్ లను జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే వారిని ప్రత్యేకంగా అభినందించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: 44 వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి

విజయవాడ పశ్చిమ, జూన్ 5భారత శక్తి): పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రజలందరి బాధ్యత అని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ



దినోత్సవం సందర్భంగా స్థానిక 44వ డివిజన్లోని గంజి ఎల్లమందయ్య వీధిలో కార్పొరేటర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ చెట్లు పెంచడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. చెట్లు కార్బన్ డయాక్సైడ్ గ్రహించి ఆక్సిజన్ ను మనకు అందిస్తాయని ఆమె చెప్పారు . పర్యావరణ పరిరక్షణతో మానవజాతి మనుగడ ముడిపడి ఉందని ఆమె అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని విడనాడాలని, కాటన్ సంచులను వాడాలని కార్పొరేటర్ రత్నకుమారి పిలుపునిచ్చారు. తెలుగుదేశం నాయకులు మైలవరపు దుర్గారావు మాట్లాడుతూ చెట్లను పెంచడం వలన మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. ప్రతి ఇంట్లోనూ ఒక చెట్టు ఉండేలా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ స్పెషల్ ఆఫీసర్ మురళి గౌడ్, సానిటరీ ఇన్స్పెక్టర్ థల్ రాజ్, శానిటేషన్ మేస్త్రీలు ధనరాజ్, శ్రీను, సచివాలయం సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు, స్థానికులు లయన్స్ కుమార్, భవాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షిస్తామని స్థానికులతో కార్పొరేటర్ రత్నకుమారి ప్రతిజ్ఞ చేయించారు.

## రాష్ట్రానికే ఆదర్శంగా.. ఆటోమేషన్ కిచెన్ లను తీర్చిదిద్దుతాం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, జూన్ 5(భారత శక్తి) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధాన్యతతో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆటోమేషన్ సెంట్రల్ కిచెన్స్ (మోడల్ కిచెన్) ల ద్వారా రాష్ట్రానికే ఆదర్శవంతంగా నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఏర్పాటు అవుతున్న ఆటోమేషన్ సెంట్రల్ కిచెన్స్ (మోడల్ కిచెన్) నిర్మాణ పనుల పరిశీలనలో భాగంగా కడప నగర పాలక బాలుర ఉన్నత పాఠశాల (మెయిన్స్)లో మోడల్ కిచెన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబందిత పాఠశాలలో ప్రస్తుతం నిర్వహణలో ఉన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కోసం ఏర్పాటు చేస్తున్న మోడల్ ఆటోమేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు మధ్యాహ్న భోజనం ఎలా నిర్వహిస్తున్నారనే విషయాలను అడుగుతూ అక్కడి వంటగది సౌకర్యాలను పరిశీలించారు. సరుకులు, వంట చెరుకు, వంట గ్యాస్ తదితర వంట నిర్వహణకు అయ్యే ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికే ఆదర్శనీయంగా ఏర్పాటవుతున్న సెంట్రలైజ్డ్ మోడల్ కిచెన్ సెంటర్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మోడల్ కిచెన్, నిర్వహణ పనులను అత్యంత ప్రాధాన్యతతో నూతన విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభం నాటికి త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈవో షంషుద్దీన్, ఆగ్రోస్ డిఎం జోయల్ విజయ్ కుమార్, హౌసింగ్ పీడి రాజా రత్నం, ఎస్ఎస్ఏ, సంబందిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగ వేడుకలు జరుపుకోవాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, జూన్ 5(భారత శక్తి) : ప్రతి ఒక్కరూ ఆచారాల వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకుని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.త్వరలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీక అయిన కడప జిల్లాలో బక్రీద్ పండుగ ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతుందన్న ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. అన్ని మతాల సంబంధించి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగ చేయకుండా పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ముఖ్యంగా జంతువధ శాలల వద్ద ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలన్నారు. ఎలాంటి మతపరమైన, సున్నితమైన అంశాలను సూక్ష్మ దృష్టిలో చూడకుండా.. అన్ని మతాల ప్రజలు సహనం, సంయమనంతో సంతోషంగా... సంప్రదయాలను గౌరవించుకుంటూ బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం అతి వేగవంతంగా తపుడు సమాచారం సోషల్ మీడియా ద్వారా.. స్ప్రెడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్న యువతను కూడా కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే.. అన్ని మతాల చెందిన యువకులకు బక్రీద్ పండుగ నిర్వహణ, సంప్రదాయాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.స్లాటర్ హౌస్ ల వద్ద శానిటేషన్, మంచినీటి సరఫరా చేయాలని, అలాగే అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్, రెవిన్యూ యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి మండలంలో కూడా పీఎస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి.. సంబందిత పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లను చేస్తామని అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యాత్మక స్లాటర్ హౌస్ ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్లాటర్ హౌస్ కు వెళ్లే జీవాలు తప్పక పశుసంవర్ధక శాఖ అధికారి ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగను ఇతరులకు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సంతోషంగా జరుపుకోవాలని ఆయన అన్నారు.ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ వారు ప్రచురించిన "ఆవులు, దూడలు, ఒంటెల వధ.. చట్ట రీత్యా నేరం" అనే పోస్టర్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు సంబందిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జమ్మలమడుగు, బద్వేల్ ఆర్డివో లు సాయిశ్రీ, చంద్రమోహన్, అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు, జెడ్పి సీఈవో ఓబులమ్మ, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హిదాయతుల్లా, డిపివో రాజ్యలక్ష్మి, రెవిన్యూ, పోలీస్, విద్య ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, పంచాయతీ శాఖ, ఫైర్ శాఖ అధికారులు జిల్లా అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, అన్ని మతాల మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భక్త మార్కండేయ స్వామి యంత్ర-మూర్తి ప్రతిష్టాపన కార్యక్రమం లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 05: శ్రీ భక్త మార్కండేయ స్వామి యంత్ర-మూర్తి ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ, భక్త మార్కండేయ స్వామి యంత్ర-మూర్తి ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు.శివుడి అనుగ్రహం ద్వారా మార్కండేయుడు చిరంజీవి అయ్యాడని, శివుని శక్తి భక్తుడి భక్తిని ప్రదర్శిస్తుందని, భగవంతునిపై నమ్మకం ఉంటే, ఎవరూ మరణం నుండి భయపడాల్సిన అవసరం లేదని,నేను ముస్లిం ఐనా మార్కండేయుడు నాతో సేవ చేయించు కుంటున్నాడు నేను సేవా చేస్తున్నాను. ఈ దేవునికి లేని ఆసమానతలు మామూలు భక్తులము మనకెందుకు అసమానతలు అన్నారు.అందరు కలిసిమెలిసి ఉండి మన సంఘాన్ని మన సమాజాన్ని ముందుకు తీసుకెళ్దాం. అభివృద్ధి చేసుకుందాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేసిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప జిల్లా, జూన్ 5: నడవలేని స్థితిలో ఉన్న బాధితురాలి కాలు సర్జరీ వైద్య ఖర్చుల నిమిత్తం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రూ 2.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ రూమ్ హాల్ లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలసి వారి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.మైదుకూరు కు చెందిన వెలుతుర్ల నాగేంద్ర తన భార్య వెలుతుర్ల లక్ష్మి ఉమాదేవి కి కుడికాలు విరిగి రెండుసార్లు సర్జరీలు జరిగినా ఇన్ఫెక్షన్ వలన మళ్లీ సర్జరీ చేయాలని డాక్టర్లు సూచించారనే విషయాన్ని....ఈ సం. జనవరి 18 వ తేదీన మైదుకూరు స్వచ్ఛ ఆంధ్ర పర్యటనలో భాగంగా ఆమె ఇంటికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు.వైద్య ఖర్చులకోసం అవసరమైన సాయం చేయాలని కోరారు. ఆ కుటుంబానికి సాయం చేయాలని కలెక్టర్ కు సీఎం ఆదేశించారు.ఆ మేరకు బాధితురాలు కుటుంబ సభ్యులను కలెక్టరేట్ కు పిలిపించి వైద్య ఖర్చుల కోసం జిల్లా కలెక్టర్ రూ 2,10,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమలో డి ఎం అండ్ హెచ్ ఓ నాగరాజు, ఆరోగ్యశ్రీ డిస్టిక్ కో ఆర్డినేటర్ బాలాంజనేయులు, బాధితురాలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## కామారెడ్డి బిజెపి జిల్లా కార్యాలయంలో 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం - సంకల్ప సహకారం







(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 05: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు తీసుకొని 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ రోజు బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అధ్యక్షతన 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం - సంకల్ప సహకారం కార్యక్రమంలో భాగంగా జిల్లా కార్యశాల నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కిసాన్ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి మాట్లాడుతూ, దేశం నరేంద్ర మోడీ ప్రధాని పదవి చేపట్టిన నాటి నుండి అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. ఈ 11 సంవత్సరాలలో భారత్ 3 వ ఆర్థిక శక్తిగా అభివృద్ధి చెందిందని అన్నారు. డిఫెన్స్ విభాగంలో అత్యంత పటిష్టంగా మారిందని ఆపరేషన్ సింధూర్ దీనికి ఉదాహరణ అని అన్నారు. దౌత్య పరంగా ఇప్పుడు భారత్ అన్ని దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండటమే కాకుండా బలమైన మిత్ర పక్షంగా ఎదిగిందని అన్నారు. ఇంటా బయట అందరి మన్ననలు పొంది భారత్ ను విశ్వగురువుగా తీర్చిదిద్దే ప్రయత్నంలో నరేంద్ర మోదీ అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని బూత్ స్థాయిలో అందరికీ వివరించే విధంగా రాష్ట్ర శాఖ కార్యక్రమాల రూపకల్పన చేసిందని వాటిని గ్రామ స్థాయిలో నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణా తార, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, పైలా కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు,రాము అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, లింగారావు నాయకులు వేణు, సంతోష్ రెడ్డి, బాల్ రాజు, అనిత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారులకు సావిత్రి బాయి ఫూలే తెలంగాణ ఐకాన్ అవార్డులు



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 5:తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న సావిత్రి బాయి ఫూలే తెలంగాణ ఐకాన్ అవార్డులు అందుకున్నారు. గురువారం రాత్రి జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఈ అవార్డులను రూబీ స్టీవెన్ సన్, పిండిగ వెంకన్న లు తీసుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గన్న గుడిసె రూబీ స్టీవెన్ సన్ ప్రస్తుతం తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితికి రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్నారు. అదే విధంగా పిండిగ వెంకన్న తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలంగాణ వికాస సమితికి రూబీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉండగా పిండిగ వెంకన్న రాష్ట్ర కమిటీకి ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ప్రొఫెసర్ వినయ్ కుమార్ చేతులు మీదుగా నగరంలో గురువారం రాత్రి సావిత్రి బాయి ఫూలే అవార్డులను రూబీ, వెంకన్న లు అందుకున్నారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో రూబీ, వెంకన్న లు క్రియాశీలక పాత్ర పోషించారు అని ఆయన అన్నారు. తెలంగాణ జెఎసి, విద్యావంతుల వేదికలో పని చేసిన రూబీ, వెంకన్న రాష్ట్ర రాజధాని ఉద్యమంలో జరిగిన అన్ని ఆందోళన కార్యక్రమాలు విజయ వంతం చేయడానికి కృషి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రముఖ సంఘ సేవకులు ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ అంబర్ పేట జెఎసి చైర్మన్ గా, రాజధాని ఉద్యమంలో రూబీ నిర్వహించిన కీలకమైనది ఆయన వివరించారు. తెలంగాణ సాధన కోసం హైదరాబాద్ నుంచి అదిలాబాద్ వరకు రూబీ అధ్వర్యంలో పలువురు ఉద్యమ కారులు పాదయాత్ర కూడా నిర్వహించారు అని ఆయన తెలిపారు. తెలంగాణ సాధన అనంతరం ఉద్యమ కారుల సంక్షేమం కోసం రూబీ, వెంకన్న లు తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితిని ఏర్పాటు చేశారని ఆయన వివరించారు. మలిదశ ఉద్యమంలో పిండిగ వెంకన్న గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ విద్యావంతుల వేదికకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు అని ఉప్పు సత్యనారాయణ తెలిపారు. అవార్డులు అందుకున్న రూబీ, వెంకన్న లు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమం కోసం తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితిని ఏర్పాటు చేశామని వివరించారు.

రాష్ట్ర సాధన అనంతరం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కారులను గుర్తించాలని నిరంతరం కృషి చేస్తున్నామని వారు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉద్యమ కారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకోకపోవడం జరిగింది అన్నారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి విజ్ఞప్తి మేరకు తెలంగాణ ప్రభుత్వం నుంచి సానుకూలంగా ప్రత్యుత్తరం కూడ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐకాన్ అవార్డులను ఇచ్చిన సావిత్రి బాయి ఫూలే ఫౌండేషన్ కు గుడిసె రూబీ స్టీవెన్ సన్, పిండిగ వెంకన్న లు ధన్యవాదాలు తెలిపారు.

## వాటర్ గ్రిడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, జూన్ 5(భారత శక్తి) : చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి పులివెందుల మున్సిపాలిటీకి తాగునీరందించే వాటర్ గ్రిడ్ పనులను జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత నీటిపారుదల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో.. పులివెందుల నియోజకవర్గంలో తాగునీటి అవసరాలను తీర్చే ఏర్పాట్లపై.. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా తాగునీటి సదుపాయం, అలాగే గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.జూన్ నెల చివరినాటికి పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా.. పెండింగ్ లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసేలా దృష్టి సారించాలన్నారు. అందుకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు ఇంకా ఏవైనా అవసరం అయితే ప్రతిపాదనలను అందజేసి.. త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. కాగా.. కేంద్ర జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా.. రూ.480 కోట్ల వ్యయంతో చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట ద్వారా.. పులివెందుల నియోజకవర్గంలో 109 గ్రామ పంచాయతీలలోని 299 గ్రామాలలోని రెండు లక్షల యాభై వేల మంది జనాభా కు 100 %ూాజణ% ల మంచి నీటిని నిరంతరాయముగా అందించుటకు వాటర్ గ్రిడ్ పనులు మంజూరు చేయడం జరిగింది. ఇందులో 183 %ానూ=% ల నిర్మాణము, 2 వేల కిలోమీటర్ల మేర పైప్ లైన్ వేయడం ద్వారా ఇంటింటికి పార్నపల్లె నీటిని కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించనుంది. కాగా ఈ పనులను జూన్ మాసం చివరి నాటికి పూర్తి చేయాలని సంబందిత ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే.. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అధిక నీటి ఎద్దడి పరిస్థితులు లేకపోయినప్పటికీ.. అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని.. ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ, ప్రాంతాల్లో తాగునీటి అవసరాలతో పాటు రూరల్ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో జల్ జీవన్ మిషన్ డిప్యూటీ సెక్రెటరీ నవనీత్ ఉపాధ్యాయ, టెక్నీకల్ ఆఫీసర్ ముఖేష్ మెగ్వాల్, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ ఈ ఏడుకొండలు, ఈఈ విజయ్ భాస్కర్, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యాలక్ష్మి, సంబందిత అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గోన్నారు.

# గాన గంధర్వుడు బాలు గారి జయంతి సందర్బంగా భారత శక్తి ప్రత్యేక కథనం

తిరుపతిజిల్లా ప్రతినిధి, జూన్ 5 (భారత శక్తి): బాలసుబ్రమణ్యం గారి గొంతులో ఓంకార నాదాలు సందానమై ప్రతి గుండెలో నిలిచాయి. ఆయన పాట శ్రోతలకు పంచామృతం. ఆయన గానం స్వరరాగ నాదామృతం. దివిలో తిరగాడే గంధర్వులు భువికి దిగి వచ్చి పాడినట్లుగా ఉంటుందా గాత్రం. ఆయన గళం నుంచి జాలువారే.. ప్రతిస్వరం ఆ దివిలో విరిసే పారిజాతమే. ఆయన స్వరంలో సప్తస్వరాలు రాగాలై నర్తిస్తాయి.బాలు గొంతులో భక్తి తొణికిస లాడుతుంది. విరహము ఉంటుంది. విషాద పాటలైనా, ప్రేమ గీతాలైనా, మాస్ బీట్స్ అయినా..సందేశాత్మకాలైనా.. ప్రతీది ఆయన నోట అలవోకగా జాలువారుతాయి. పాటలోని మాటలను ...గొంతులో అభినయ ముద్రలుగా నిలిపి తెలుగుదనం ఒలికించిన విలక్షణ గాయకుడు యస్ పి బాలసుబ్రమణ్యం. ఆయన గొంతుకు తరాల అంతరాలు తెలియదు.బాలసుబ్రహ్మణ్యం.. ,1946 జూన్ 4న నెల్లూరులోని కోనేటమ్మపేటలో జన్మించారు. ఆయన అసలు పేరు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం. చిన్నతనం నుంచే పాటలు పాడటం హాబీగా మార్చుకున్న బాలుకి.. తొలిసారిగా 1966లో విడుదలైన 'శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న' చిత్రంలో పాడే అవకాశం వచ్చింది.ఎంతమంది కథానాయకులకైనా తన అద్భుతమైన స్వరంతో వారికి అనుగుణంగా పాటలు పాడగల గొప్పగాయకుడు ఎస్. పి. బీ. తెలుగు సినిమా గీతాలకు దొరికిన ఒకానొక ఆణిముత్యం బాలసుబ్రహ్మణ్యం. తెలుగు సినిమా పాటకు ఘంటసాల తరువాత లభించిన సిసలైన వారసుడు బాలసుబ్రహ్మణ్యం.గాయకుడిగా కెరీర్ ప్రారంభించాక ఆయనకు పెద్ద స్టార్స్ కు పాడే అవకాశం రాలేదు. కేవలం అప్పుడే వస్తున్న అప్ కమింగ్ హీరోలకే పాడే అవకాశం మాత్రమే వచ్చేది. అప్పటికే ఎన్టీఆర్, ఏన్నార్ లకు ఘంటసాల తప్ప ఎవరు పాడినా.. ప్రేక్షకులు అంగీకరించే పరిస్థితి లేదు. అయిన అడపా దడపా ఘంటసాలతో గొంతు కలిపే పాడే అరుదైన అవకాశాలు.. బాలుకు రానే వచ్చాయి. ప్రతిరాత్రి వసంత రాత్రి.. ప్రతిగాలి పైర గాలి.. అంటూ 'ఏకవీర' లో అమర గాయకుడు ఘంటసాల తో బాలు ఆలపించిన గానం నేటికి శ్రోతలను హమ్ చేసుకునేలా ఉంటాయి.ఘంటసాల మరణం తర్వాత తెలుగు సినిమా పాటలకు పెద్ద దిక్కైయ్యాడు బాలు. సన్నివేశానికి న్యాయం చేకూరుస్తూ..సన్నివేశ బలానికి తగినట్టు నటనను గాత్రంలో ప్రస్పుటంగా ప్రకటించగల గాయకుడు ఎప్పీ. ముఖ్యంగా బాలు సినీ జీవితం 'శంకరాభరణం' సినిమాతో పూర్తిగా మారిపోయింది. అప్పటివరకు మాస్ గీతాలకే పరిమితం అయిన బాలు.. ఈ సినిమాలో క్లాసికల్ పాటలను సైతం అద్భుతంగా పాడగలనని విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్నాడు. ఈ చిత్రానికి బాలు తొలిసారి జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డు అందుకున్నాడు.పదాల మాధుర్యాన్ని గమనించి.. బాలూ చేసే ఉచ్చారణ పాటను పండిత పామరులకి చేరువ చేసింది. తరాలు మారినా ఎందరో నటులకు వారి హావభావలకు, నటనా శైలులకు అనుగుణంగా ఆయన పాటలు పాడి.. ప్రాణం పోశారు. ఒక పాట విన్న తర్వాత ఆ పాట ఏ హీరోదో చెప్పడం అది బాలూ పాడితేనే సాధ్యం. తెలుగులోనే కాదు ఉత్తరాదిన కూడా పాడి తన సత్తా చాటాడు బాలూ. హిందీలో తొలిసారి పాడిన 'ఏక్ దూజేలియే' చిత్రంలో.. అద్భుతంగా పాడి అక్కడి వారిచేత శభాష్ అనిపించుకున్నాడు. ఈ సినిమాకు కూడా ఉత్తమ గాయకుడిగా జాతీయ అవార్డు దక్కడం విశేషం. ఈ విధంగా తెలుగు తో పాటు హిందీ, తమిళం, కన్నడ లాంటి నాలుగు భాషల్లో కలిపి ఆరు సార్లు జాతీయ ఉత్తమ గాయకుడిగా నిలవడం ఒక్క బాలసుబ్రహ్మణ్యానికే చెల్లింది.'చెల్లెలి కాపురం' లో బాలు పాడిన.. చరణ కింకరులు ఘల్లు ఘల్లు మన...కర కంకణములు గల గల లాడగా అంటూ ఎస్పీ తన గొంతులో పలికించిన వేరియేషన్స్ శ్రోతల మదిలో ఇప్పటికీ అలాగే నిలిచిపోయాయి. ఏపాట పాడినా.. ఆ పాటకే అందం వచ్చేంతగా ఆలపించడం బాలు కి తప్పించి మరొకరికి సాధ్యం కాదు. భక్తి గీతాలను సైతం ఎంతో రసరమ్యంగా పాడ్డంలో బాలూ శైలే వేరు. ముఖ్యంగా అన్నమయ్య, శ్రీరామదాసు, శ్రీరామరాజ్యం చిత్రాలలో ఎస్పీ ఆలపించిన భక్తి గీతాలు ఇప్పటికీ ప్రతి ఇంటా వినిపిస్తూనే ఉన్నాయి.గాయకుడిగానే కాకుండా.. సంగీత దర్శకుడిగా, నటుడిగా, టి.వి వ్యాఖ్యాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్ గా, నిర్మాతగా.. ఇలా బహుముఖ ప్ఞను ప్రదర్శించాడు బాలు. సంగీత దర్శకుడిగా 'పడమటి సంధ్యారాగం', 'జాకీ', 'మగధీరుడు', 'జైత్రయాత్ర' వంటి యాభై చిత్రాల వరకూ మ్యూజిక్ అందించాడు. నిర్మాతగా ఆదిత్య369, శుభసంకల్పం, భామనే సత్యభామనే, వంటి సూపర్ డూపర్ హిట్ చిత్రాలను నిర్మించి తన అభిరుచి చాటుకున్నాడు. బాలసుబ్రమణ్యం పాటలు పాడుతుంటే వినేవారికి మాటలు రావు. ఓ పాపా లాలి చిత్రంలో 'మాటేరాని చిన్నదాని కళ్లు పలికే ఊసులు' అంటూ...బాలూ నటించి, ఆలపించిన బ్రీత్ లెస్ గీతం సంగీతాభిమానులు ఎప్పటికి మరిచిపోలేరు. 'భైరవ ద్వీపం'లో బాలూ పాడిన శ్రీ తుంబుర నారద నాదామృతం పాటలో..బాలూ ఆలపించిన గంధర్వ గానం శ్రోతలకు మళ్లీ మళ్లీ వినాలనిపిస్తుంది.నాలుగు దశాబ్దాల్లో... 11భాషల్లో 40వేల పాటలు పాడి గిన్నిస్ రికార్డు నెలకొల్పాడు బాలు. ఆయన అందుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పురస్కారాలకు లెక్కే లేదు.ఉత్తమ గాయకుడిగా ఆరు సార్లు జాతీయ అవార్డు. కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మక పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నాడు. అందుకే బాలు నోటి నుంచి వచ్చే ప్రతి పాట పంచామృతమే. గాయకుడిగా ఆయన స్వరరాగ ప్రవాహం ఇప్పటికీ ఎప్పటికీ తరగని నిధి.ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తన 74వ ఏట కరోనాతో పోరాడుతూ సెప్టెంబరు 25,2020 మధ్యాహ్నం 01గం.04 నిమిషాలకు తుది శ్వాస విడిశారు. ఆయన మృతితో సంగీత ప్రపంచంలో ఓ శకం ముగిసినట్టైయింది. అంతేకాదు తెలుగు సినీ సంగీత ప్రపంచంలో ఆయనకు ముందు తర్వాత అనేంతగా తెలుగుతో పాటు దక్షిణాది సినీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి:జిల్లా కలెక్టర్

ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 5 (భారత శక్తి) : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. గురువారం ములుగు మండలం ఇంచర్ల గ్రామం రైతు వైదిక లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే వెంకటాపూర్ మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోని మిగతా 09 మండలాల్లో గల అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు,విస్తీర్ణం హెచ్చు తగ్గులు,వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయ భాస్కర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 7 నిమిషాల మీటింగ్ పెట్టి.. లేఆఫ్‌లు ప్రకటించిన ఐబీఎం

టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతూనే ఉన్నాయి. గతేడాది ఆర్థిక మాంద్యం భయాలతో వేలాది మందిని తొలగించిన సంస్థలు.. ఇప్పుడు కృత్రిమ మేధని అందిపుచ్చుకునేందుకు మళ్లీ లేఆఫ్ లు మొదలుపెట్టాయి. తాజాగా టెక్ దిగ్గజం ఐబీఎం (%×దీవీ%) తమ సంస్థలో కొంతమందికి ఉద్వాసన పలికింది. మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ డివిజన్లలో లేఆఫ్‌లు ప్రకటించింది.అయితే, కేవలం ఏడు నిమిషాల సమావేశంలో ఈ తొలగింపులపై ప్రకటన రావడంతో ఉద్యోగులు షాక్‌కు గురయ్యారు. ఐబీఎం చీఫ్ కమ్యూనికేషన్ ఆఫీసర్ జొనాథన్ అదాషేక్ ఇటీవల సమావేశం నిర్వహించి.. మార్కెటింగ్, కమ్యూనికేషన్ విభాగాల్లో లేఆఫ్‌లు చేస్తున్నమని ప్రకటించినట్లు కంపెనీకి చెందిన విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఎంతమందిని తొలగించారన్నదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. దీనిపై ఐబీఎం ఇంకా అధికారిక ప్రకటన ఇవ్వలేదు. హిండెన్ బర్గ్‌ను ఎదుర్కొనేందుకు అదానీ వ్యూహం ఇదీ..!

కాగా.. రానున్న ఏళ్లలో చాలా ఉద్యోగాల స్థానంలో కృతిమ మేధను భర్తీ చేయాలని నిర్ణయించుకున్నట్లు గతేడాది కంపెనీ సీఈఓ అరవింద్ కృష్ణ వెల్లడించిన విషయం తెలిసిందే. ఇందుకోసం కొత్త నియామకాలను నిలిపివేయనున్నట్లు తెలిపారు. “రానున్న ఐదేళ్లలో కంపెనీలో దాదాపు 30శాతం ఉద్యోగుల స్థానంలో ఏఐని తీసుకురానున్నాం. ఇందుకోసం మానవ వనరుల వంటి విభాగాల్లో నియామకాలను తగ్గించడం లేదా నిలిపివేయడం చేస్తాం” అని ఆయన ప్రకటించారు. ఐటీఎం ఇప్పటికే గతేడాది పలు విభాగాల్లో వేలాది మందిని తొలగించింది.ఐబీఎం సహా పలు ప్రముఖ కంపెనీల్లో ఈ ఏడాది కూడా లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. 2024లో ఇప్పటివరకు 200లకు పైగా సంస్థలు దాదాపు 50వేల ఉద్యోగాల కోతలు ప్రకటించినట్లు %ఝిఎశీటటం.టఎఱ% వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది.

# విదేశాల్లో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం ఆరోగ్య బీమా



లక్షలాది భారతీయ విద్యార్థులు ఇప్పటికే విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. చాలా మంది విద్యార్థులు విదేశీ విద్యకోసం అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, ఐరోపా దేశాలకు ప్రయాణిస్తున్నారు. ఆ దేశ విశ్వవిద్యాలయాలు విస్తృత శ్రేణి అకడమిక్ ప్రోగ్రామ్స్, అత్యాధునిక పరిశోధన అవకాశాలతో నాణ్యతగల ఉన్నత విద్యను అందిస్తున్నాయి.కొన్ని దేశాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, భద్రత, జీవన నాణ్యత వంటి జీవన ప్రమాణాలు.. విద్య, వ్యక్తిగత అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కోరుకునే భారతీయ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. వేరే దేశానికి చదువుకోవడానికి వెళ్లినప్పుడు చాలా ముఖ్యమైన అంశం ఆరోగ్య రక్షణ గురించి తెలుసుకోవడం. ఊహించని మెడికల్ ఎమర్జెన్సీల విషయంలో విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు తగిన ఆరోగ్య బీమా కవరేజీని కలిగి ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యం. విద్యార్థుల కోసం అనేక ఆరోగ్య బీమా పథకాలు అందించే కీలకమైన ప్రయోజనాలను ఇక్కడ చూద్దాం.నగదు రహిత చికిత్స

విదేశంలో విద్యార్థి అనారోగ్యంతో బాధపడినా/ ప్రమాదానికి లోనైన సందర్భంలో వైద్య సహాయం అవసరమైనప్పుడు ఆరోగ్య బీమా పథకాలు ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వీలు కల్పిస్తాయి. ఈ బీమా.. డాక్టర్ అపాయింట్‌మెంట్స్, దంత చికిత్స లాంటి సేవలను కవర్ చేస్తుంది. ఆసుపత్రి వైద్యులు.. పేషెంట్ రోగ నిర్ధారణ కోసం ఎక్స్-రే, అల్ట్రాసౌండ్ లేదా రక్త పరీక్షలను సూచించొచ్చు. ఈ ఖర్చులు కూడా విద్యార్థి ఆరోగ్య బీమా పథకం కింద కవర్ అవుతాయి. అన్ని క్లెయిమ్స్ నగదు రహిత పద్ధతిలో పరిష్కరించుకోవచ్చు.మానసిక ఆరోగ్యంసాధారణంగా విద్యార్థుల జీవితం ఒత్తిడితో కూడుకున్నది. ఇది వారి మానసిక ఆరోగ్యంపై, విద్యపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని బీమా సంస్థలు విద్యార్థుల మానసిక ఆరోగ్య ఖర్చులను కూడా కవర్ చేయడానికి పాలసీలో అవకాశాన్ని ఇస్తున్నాయి. ఈ బీమాలో భాగంగా మానసిక ఆరోగ్యానికి ఉపకరించే కౌన్సెలింగ్, థెరపీ, సంబంధిత ఖర్చులను కూడా పాలసీ కవర్ చేస్తుంది.రవాణా ఖర్చులుపేషెంట్ చికిత్సకు వైద్యుడి వద్దకు లేదా ఆసుపత్రికి వెళ్లాల్సిన సందర్భంలో అయ్యే రవాణా ఖర్చులను రీయింబర్స్‌మెంట్ చేసుకోవచ్చు. తీవ్ర అనారోగ్యానికి గురయినప్పుడు, ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు.. ఆసుపత్రికి వెళ్లడానికి అంబులెన్స్ ఛార్జీలను కూడా పాలసీ చెల్లిస్తుంది. అంతేకాకుండా తీవ్రమైన అనారోగ్యానికి గురై, భారత్‌కు తిరిగి వెళ్లాలనుకుంటే.. రవాణా ఖర్చులను కవర్ చేస్తుంది. పేషెంట్‌తో పాటు తోడు వెళ్లే సహాయకుడి ప్రయాణ ఖర్చులను కూడా అవసరాన్ని బట్టి చెల్లిస్తుంది. చికిత్స కోసం భారత్‌కు చేరుకున్న తర్వాత విద్యార్థులకు వైద్య బీమా 30 రోజుల వరకు చికిత్సను కవర్ చేస్తుంది. డాక్టర్లు నిరంతర చికిత్సను సూచిస్తే దాని ఫాలో-అప్‌ల కోసం అయ్యే ఖర్చులు కూడా కవర్ అవుతాయి.పరిహారం, ట్యూషన్ ఫీజుఒకవేళ విద్యార్థి అనారోగ్యంపాలై ఎక్కువ కాలం ఆసుపత్రిలో ఉంటే చదువును కొనసాగించలేరు. ఈ అంతరాయం అతడి కెరీర్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. దీర్ఘకాలిక చికిత్స భవిష్యత్‌లో అతడికి లభించే అవకాశాలను కోల్పోయేలా చేస్తుంది. ఇటువంటి సమయంలో ఆరోగ్య బీమా.. విద్యార్థికి జరిగిన అంతరాయానికి నష్ట పరిహారాన్ని అందిస్తుంది. ఇంకా, కొంత మంది విద్యార్థులకు ఫీజులు చెల్లించే స్పాన్సర్స్ ఉంటారు. స్పాన్సర్ వల్ల విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం అందుతుంది. ఒకవేళ విద్యార్థికి సంబంధించిన స్పాన్సర్ చనిపోతే, మిగిలిన కాలవ్యవధికి చెల్లించవలసిన ట్యూషన్ ఫీజును మెడికల్ ఇన్సురెన్స్ భర్తీ చేస్తుంది. దీనివల్ల విద్యార్థి ఆర్థిక విషయాలపై దృష్టిపెట్టకుండా చదువును కొనసాగించే అవకాశం ఉంది.

ప్రయాణం కోసంవిద్యార్థి విదేశాలలో తీవ్ర అనారోగ్యానికి గురై 7 రోజుల కంటే ఎక్కువ సమయం ఆసుపత్రిలో ఉండాల్సి రావచ్చు. అటువంటప్పుడు తల్లిదండ్రులు పేషెంట్ (విద్యార్థి)ని చూడడానికి, రానుపోను ప్రయాణానికి విమానం టిక్కెట్ల ఖర్చులను బీమా సంస్థ చెల్లిస్తుంది. దురదృష్టవశాత్తు విద్యార్థి మరణించిన సందర్భంలో మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అయ్యే ఖర్చులనూ బీమా పాలసీ కవర్ చేస్తుంది. లేదా విదేశంలో ఖననం/ దహన సంస్కారాలు జరిగినప్పుడు అయ్యే ఖర్చులను కూడా కవర్ చేస్తుంది.విదేశాల్లో చదువుకునే విద్యార్థుల కోసం కొన్ని ఆరోగ్య బీమా సంస్థలు పాలసీలను అందిస్తున్నాయి... ఈ పాలసీలు ఎటువంటి కవరేజీలను ఇస్తున్నాయో ఇక్కడ చూడండి.ఐసీఐసీఐ లాంబార్డ్ స్టూడెంట్ మెడికల్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో ఇంటర్నేషనల్ స్టూడెంట్ సురక్ష, బజాజ్ అలయన్జ్ గ్లోబల్ పర్సనల్ గార్డ్, టాటా ఏఐజీ స్టూడెంట్ గార్డ్ పాలసీలు పేషెంట్‌కు సంబంధించిన డాక్టర్ అపాయింట్‌మెంట్ ఫీజులు, ఆసుపత్రిలో చికిత్స, అంబులెన్స్‌లో తరలింపు వంటి ఖర్చులను అందిస్తున్నాయి. ఒకవేళ పేషెంట్ చనిపోతే మృతదేహాన్ని స్వదేశానికి తరలించడానికి అయ్యే ఖర్చులను చెల్లిస్తాయి. మానసిక ఆరోగ్య సమస్యలకు సమగ్ర కవరేజీని అందిస్తున్నాయి. ముందస్తు వ్యాధులను వెయిటింగ్ పీరియడ్‌ను బట్టి కవర్ చేస్తాయి. నగదు రహిత చికిత్స సేవలను అందిస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో.. అత్యవసర సమయంలో పేషెంట్ (స్టూడెంట్) తల్లిదండ్రులు విదేశాలకు వెళ్లడానికి అయ్యే విమాన ఖర్చులను కూడా భరిస్తుంది. బజాజ్ అలయన్జ్.. ప్రమాదవశాత్తు మరణం, వైకల్యం, అత్యవసర దంత చికిత్స, పాస్‌పోర్ట్, ఇతర ముఖ్యమైన పత్రాల నష్టానికి కూడా పరిహారాన్ని అందిస్తోంది.చివరిగా: ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ ఖర్చులు వేగంగా పెరుగుతున్నాయి. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఒక సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని కలిగి ఉండడం వల్ల అనుకోని వైద్య అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక రక్షణతో పాటు మనశ్శాంతి లభిస్తుంది.

# మీ వ్యక్తిగత ఆర్థిక ప్రయాణాన్ని ఎలా ప్రారంభించాలి?

ఆర్థిక ప్రణాళిక అనేది జీవిత లక్ష్యాలను క్రమపద్ధతిలో, ప్రణాళికాబద్ధంగా సాధించడానికి ఉపయోగపడే ప్రక్రియ. ఆర్థిక వనరులను సాధ్యమైనంత ఉత్తమంగా ఉపయోగించుకోవడం ఇందులో ఒక ముఖ్య భాగం. ముఖ్యంగా యువకులలో ఆర్థిక ప్రణాళికను అలవాటు చేయడం చాలా కష్టమైన పని. అయినప్పటికీ, వారు తమ ఆర్థిక విషయాల గురించి స్వచ్ఛందంగా ప్లాన్ చేసినప్పుడు ఎక్కడ, ఎలా ప్రారంభించాలో చాలా మందికి తెలియదు. ఇక్కడ ఆర్థిక ప్రణాళికను బాగా ప్లాన్ చేసుకోవడానికి కొన్ని సూత్రాలు ఉన్నాయి. అవేంటో చూడండి.ఒకరు తమ డబ్బును సరిగ్గా ప్లాన్ చేసి నిర్వహించడానికి గొప్ప ఆర్థిక నేపథ్యం నుంచి రావలసిన అవసరం లేదు. కొంచెం నిబద్ధత చూపిస్తే సరిపోతుంది. పొదుపు చేయాలని నిర్ణయించుకోవడం డబ్బు నిర్వహణలో మొదటి అడుగు. మెరుగైన ఆర్థిక స్వాతంత్రం కోసం డబ్బు ఆదా చేయడం ఎవరికైనా చాలా ముఖ్యం. అత్యవసర పరిస్థితిలో అప్పు కూడా దొరకని పరిస్థితిని ఊహించుకోండి. డబ్బు పొదుపు అవసరం ఏంటో మీకే తెలుస్తుంది. మీకు స్మార్ట్ ఫోన్, వాహన కొనుగోలు లాంటి కొన్ని కనీస అవసరాలు ఉండొచ్చు. ఇలాంటి పరిస్థితులన్నింటిలో మీకు డబ్బు అవసరం. కానీ అది ఎక్కడ నుంచి వస్తుంది? వీటన్నింటికి సరైన సమాధానం పొదుపు. డబ్బును ఆదా చేయడం వల్ల రుణాల ఉచ్చులో పడకుండా ఉంటారు. అంతేకాకుండా క్రమం తప్పని పొదుపు మిమ్మల్ని ధనవంతుల్ని చేస్తుంది. దీనివల్ల మీ ఆర్థిక లక్ష్యాలను సకాలంలో సాధించవచ్చు. యువకుడిగా ఉన్నప్పుడు మీ పొదుపును ప్రతి నెలా సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయొచ్చు.

జీతం మీద జీవించే వారి ఖర్చులు వారి శక్తికి మించే ఉంటాయి. ముఖ్యంగా అనుకోని ఖర్చులు చాలా మందిని ఇబ్బందులకు గురిచేస్తాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ బడ్జెట్ సిద్ధం చేయడానికి ప్రయత్నించండి. తగిన బడ్జెట్‌ను సిద్ధం చేసుకోకపోతే మీ నగదు ప్రవాహాలను నియంత్రించలేరు. బడ్జెట్.. మీకు ఎంత డబ్బు వస్తోంది? ఆ నిధులు ఎలా ఖర్చు చేయాలో చూపిస్తుంది. మీ ఖర్చులను వర్గీకరించండి. అత్యవసర అవసరాలు, లగ్జరీ, నివారించదగినవి.. ఈ విధంగా ఖర్చుల పూర్తి జాబితాను తయారు చేసుకోండి. దీనివల్ల దేనికి ముందుగా ఖర్చు పెట్టాలో తెలుస్తుంది. పరిమిత వనరులు, అపరిమిత కోరికలు చాలా మందికి ఉంటాయి. కానీ మీరు మీ వనరులను సరిగ్గా నిర్వహించాలి. ఈ వాస్తవాన్ని ఎంత త్వరగా తెలుసుకుంటే నివారించదగిన ఖర్చుల పట్ల మీరు అంత మెరుగ్గా నియంత్రించుకోగలుగుతారు. సరిగ్గా ప్లాన్ చేస్తే కొంత డబ్బును వినోదం, విశ్రాంతి కోసం కేటాయించొచ్చు.బ్యాలెన్స్ షీట్‌ప్రతి ఏడాది మీ ఆస్తులు, రుణాల జాబితాను తయారుచేయండి. బ్యాంక్ బ్యాలెన్స్, పెట్టుబడులు, ఇంటి విలువ, ఇతర ఆస్తుల విలువను లెక్క కట్టండి. కారు రుణం, ఇంటి రుణం, క్రెడిట్ కార్డు బ్యాలెన్స్‌లతో పాటు ఇతర రుణాల జాబితాను తయారు చేయండి. ఈ వ్యక్తిగత బ్యాలెన్స్ షీట్ ఆర్థికపరంగా మీ నికర విలువను చూపుతుంది. మీ ఆర్థిక స్థితిని తదుపరి స్థాయికి తీసుకెళ్లడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. మిగులు నగదుమీ దగ్గర ఉన్న మిగులు నగదుతో ఎలా వ్యవహరిస్తారనేది మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మీ వద్ద ఉన్న నగదును సరైన చోట పెట్టుబడి పెట్టకపోతే ద్రవ్యోల్బణం కారణంగా దాని విలువ క్షీణించే అవకాశం ఉంది. ముఖ్యంగా మీరు అనుకున్న విధంగా పదవీ విరమణ చేయలేరు. కాబట్టి, పెట్టుబడిని ఎంత త్వరగా ప్రారంభిస్తే అంత మంచిది. మీ మిగులు మొత్తాన్ని రుణాలను తీర్చడానికి వాడొచ్చు. పదవీ విరమణ నిధిపదవీ విరమణ ప్రణాళిక ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యం. అంతేకుండా ప్రతి సంవత్సరం ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ ఖర్చులన్నింటికీ నిధులు సమకూర్చడానికి మీరు సొంత నిధులను కలిగి ఉండాలి. పదవీ విరమణ ప్లాన్ చేస్తున్నప్పుడు విరమణ వయసును నిర్ణయించుకోవాలి. అలాగే, మీకు ప్రతి నెలా ఎంత డబ్బు అవసరమో అంచనా వేయాలి. పదవీ విరమణ నిధి, పెన్షన్ కోసం ఎన్‌పీఎస్ మంచి పథకం.ఆర్థిక ప్రణాళికలో రుణ నిర్వహణ చాలా కీలకం. మీకు ఎక్కువ అప్పులు ఉన్నట్లయితే, ముందుగా ఎక్కువ వడ్డీ ఉన్న రుణాన్ని తీర్చివేయండి. ముఖ్యంగా క్రెడిట్ కార్డు రుణాలు అత్యంత ఖరీదైనవి. ప్రతి నెలా మీ జీతం క్రెడిట్ అయిన వెంటనే, క్రెడిట్ కార్డు బ్యాలెన్స్‌ను పూర్తిగా చెల్లించండి. 'మినిమం బ్యాలెన్స్' చెల్లించడానికి అవకాశమున్నా సరే దాన్ని వినియోగించకూడదు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే క్రెడిట్ కార్డును ఉపయోగించడం అలవాటు చేసుకోండి. ఎల్లప్పుడూ రుణాన్ని చివరి ప్రయత్నంగా ఉంచండి. వీలైనంత వరకు మీ కొనుగోళ్లకు నగదు రూపంలో చెల్లింపులు చేయండి. దీనివల్ల దుబారా ఖర్చు చాలా వరకు తగ్గుతుంది. ఇంటి రుణం వంటి పెద్ద రుణాన్ని తీసుకున్నప్పుడు బ్యాలెన్స్ బదిలీ ఎంపిక కోసం చూడండి.



# ఆర్సీబీ విజయోత్సవాలు అంత హడావిడిగా ఎందుకు నిర్వహించారు?: మదన్‌లాల్

ఐపీఎల్ 18వ సీజన్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( విజేతగా నిలిచింది. ఇదే వారికి తొలి టైటిల్. ఈ నేపథ్యంలో బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ యాజమాన్యం ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. అయితే మైదానం వెలుపల తొక్కిసలాట చోటుచేసుకుని 11 మంది మృతి చెందారు. పలువురు గాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటనపై 1983 వరల్డ్ కప్ గెలిచిన నాటి భారతజట్టులో (%ుఋఎ ×అఎఋు%) సభ్యుడైన మదన్‌లాల్ స్పందించాడు. విజయోత్సవ ఏర్పాట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయంటూ ఆర్సీబీని తప్పు బట్టాడు. అంత హడావుడిగా ఈ కార్యక్రమాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించాడు.

'మీరు గత రాత్రి అహ్మదాబాద్‌లో సంబరాలు చేసుకున్నారు. మరుసటి రోజే బెంగళూరులో గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించడానికి ఇంత తొందరపాటు ఎందుకు? సరైన ప్రణాళిక లేకుండా ఈ కార్యక్రమం నిర్వహించడం వల్ల అనవసరంగా పదకొండు మంది తమ ప్రాణాలు కోల్పోయారు' అని మదన్ లాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడంతో తమ అభిమాన క్రికెటర్లను చూడటానికి లక్షల సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. కానీ స్టేడియం సామర్థ్యం కేవలం 35 వేలు. దీంతో మైదానం వెలుపల తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 11 మంది మృతి చెందగా, దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయం తెలియడంతో నిర్వాహకులు వేడుకను 20 నిమిషాలకు కుదించి, ముగించారు.

ఇది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం కాదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివరణ ఇచ్చారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విజయోత్సవం జరిగిందని తెలిపారు. బెంగళూరు జట్టు కాబట్టి తాము కార్యక్రమంలో పాల్గొన్నామని ఆయన విలేకరులతో అన్నారు.




# బెంగళూరు తొక్కిసలాట ఘటన.. మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించిన ఆర్సీబీ

: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది కుటుంబాలకు ఆర్థిక సాయం చేసేందుకు ఆ జట్టు యాజమాన్యం ముందుకొచ్చింది. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ పేజీలో పోస్టు చేసింది. అంతేకాకుండా ఈ ఘటనలో క్షతగాత్రులైన వారికి చికిత్స కోసం ఆర్సీబీ కేర్స్ పేరిట నిధులు సేకరించాలని నిర్ణయించింది. మరోవైపు మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున కర్ణాటక ప్రభుత్వం పరిహారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

'తొక్కిసలాట వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాం. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నాం. మా అభిమానులందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాం. మీడియాలో వచ్చిన కథనాలతో ఈ ఘటన గురించి మాకు తెలిసింది. అభిమానులు పెద్ద ఎత్తున రావడంతో ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. మాకు ప్రతి ఒక్కరి క్షేమం అత్యంత కీలకం. దీని గురించి తెలిసిన వెంటనే మా కార్యక్రమాలను రద్దు చేసుకున్నాం. బాధిత కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. స్థానిక అధికారులకు మా పూర్తి సహకారం అందిస్తాం. ఈ సందర్భంగా మాకు మద్దతుగా నిలిచే వారికి ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాం. అందరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నాం" అని ఆర్సీబీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

# భారత్‌తో తొలి టెస్టు.. జట్టును ప్రకటించిన ఇంగ్లాండ్

: టీమ్‌ఇండియా త్వరలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఆతిథ్య జట్టుతో భారత్ ఐదు టెస్టులు ఆడనుంది. ఈ సిరీస్‌తోనే 2025-2027 డబ్ల్యూటీసీ ప్రారంభంకానుంది. ఇప్పటికే శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా 18 మందితో భారత జట్టును ఎంపిక చేశారు. జూన్ 20 నుంచి హెడింగ్లీ వేదికగా తొలి టెస్టు ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్ కోసం ఇంగ్లాండ్ బెన్‌స్టోక్స్ కెప్టెన్‌గా 14 మందితో జట్టును ప్రకటించింది. పేసర్ గాస్ అట్కిన్సన్ గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు.




తొలి టెస్టుకు ఇంగ్లాండ్ టీమ్: బెన్ స్టోక్స్, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జాక్ క్రాలీ, బెన్ డకెట్, జేమీ ఒవర్టన్, ఓలీ పోప్, జో రూట్, జేమీ స్మిత్, జోష్ టంగ్, క్రిస్ వోక్స్.

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్.

సిరీస్ షెడ్యూల్ ఇదే..

తొలి టెస్ట్ - 2025 జూన్ 20 - 24, వేదిక: హెడింగ్లీ, లీడ్స్

రెండో టెస్ట్ - 2025 జులై 2 - 6, వేదిక: ఎడ్జ్‌బస్టన్, బర్మింగ్‌హామ్

# కాస్త ముందుగానే ఇంగ్లండ్‌కు కేఎల్ రాహుల్

ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమ్‌ఇండియా దిగ్గజ ఆటగాళ్లైన రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత జట్టులో కేఎల్ రాహుల్ కీలక ఆటగాడిగా మారనున్నాడు. జూన్ 20 నుంచి టీమ్‌ఇండియా ఇంగ్లండ్‌తో అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్‌లో రాణించాలని కేఎల్ రాహుల్ కృతనిశ్చయంతో ఉన్నాడు. ఈనేపథ్యంలో ఇంగ్లండ్ పరిస్థితులకు అలవాటుపడేందుకు ప్రధాన భారత జట్టు కంటే కాస్త ముందుగానే కేఎల్ రాహుల్ ఇంగ్లండ్‌కు చేరుకోనున్నాడు. ఈ బ్యాటర్ గతంలో ఆ జట్టు మీద రెండు సెంచరీలు బాదాడు. రాహుల్ ఇప్పటివరకు 58 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో అతడి యావరేజ్ 33.57.




టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ( ఇతర జట్టు సభ్యులు ముంబయి నుంచి ఆలస్యంగా బయలుదేరి వెళ్లనున్నారు. నిజానికి గిల్, సాయిసుదర్శన్ ఇంగ్లండ్‌లో సన్నాహక టెస్టు మ్యాచ్ ఆడతారని అంతా అనుకున్నారు. కానీ ఐపీఎల్ మ్యాచ్‌ల వల్ల అది సాధ్యం కాలేదు. దీంతో వారు ప్రధాన టెస్ట్ సిరీస్‌కు ముందు ఇంట్రా స్క్వాడ్ గేమ్‌లో మాత్రమే ఆడనున్నారు. అలాగే ఇండియా ఎ జట్టు శుక్రవారం నుంచి ఇంగ్లండ్ లయన్స్‌తో రెండో, చివరి అనధికారిక టెస్టు ఆడనుంది. మొదటి అనధికారిక టెస్టులో ఆడని ఆకాశ్ దీప్ రెండో మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. డ్రాగా ముగిసిన మొదటి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో కరుణ్‌నాయర్ డబుల్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే.

ఇండియా ఎ జట్టు: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధ్రువ్ జురేల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్, ఇషాన్ కిషన్, మానవ్ సుతార్, తనుష్ కోటియన్, ముఖేశ్ కుమార్, అకాశ్ దీప్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, రుత్‌రాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్ పాండే, హర్ష్ దూబె

ఇంగ్లండ్ లయన్స్ జట్టు: జేమ్స్ రెవ్స్ (కెప్టెన్, వికెట్ కీపర్), పర్హాన్ అహ్మద్, జోర్డాన్ కాక్స్, రాకీ ఫ్లింటాఫ్, ఎమిలియొగే, టామ్ హైన్స్, జార్జ్ హిల్, మాక్స్ హొల్డెన్, బెన్ మెకిన్నీ, ఎడ్డీ జాక్, అజిత్ సింగ్ డేల్, జోష్ టంగ్, క్రిష్ వోక్స్

# విషాదం గురించి అప్పుడు విరాట్ కోహ్లీకి తెలిసి ఉండకపోవచ్చు: అతుల్ వాసన్

ఐపీఎల్ 2025 టైటిల్ విజేతగా నిలిచిన, ఆర్సీబీ పెరేడ్ నేపథ్యంలో బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు తమ ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయాలపాలయ్యారు. అభిమానులను నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారు. పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ గుమిగూడటంతో పరిస్థితి చేయి దాటిపోయింది. అయితే ఈ సంఘటన జరిగిన తర్వాత కూడా చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవాలు నిర్వహించడంపై ఆర్సీబీ యాజమాన్యం, జట్టు సభ్యుడు విరాట్ కోహ్లీపై (%పలు విమర్శలు వచ్చాయి. అయితే ఆ సమయంలో ఈ విషయం విరాట్ కోహ్లీకి తెలిసి ఉండకపోవచ్చని మాజీ క్రికెటర్ అతుల్ వాసన్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు.



ఈ సంఘటనపై తర్వాత విరాట్ కోహ్లీ ఆన్‌లైన్ వేదికగా తన సంతాపాన్ని తెలిపాడు. 'తొక్కిసలాటలో ప్రజలు చనిపోయారన్న విషయం విజయోత్సవాలు జరుగుతున్న సమయంలో విరాట్ కోహ్లీకి తెలిసి ఉండకపోవచ్చు. రాజకీయ నాయకులు, ఫ్రాంఛైజీ వాళ్లకు తెలిసినా వారు తమ స్వప్రయోజనాలకే పెద్దపీట వేస్తారు. కానీ విరాట్ కోహ్లీ, ఇతర ఆటగాళ్లకు తెలిసి ఉండకపోవచ్చు. ఒకవేళ ఈ విషయం తెలిసి ఉంటే.. విరాట్ కోహ్లీ ఆ విజయోత్సవాల్లో పాల్గొనకుండా, అక్కడినుంచి తక్షణమే బయటకు వెళ్లిపోయి ఉండేవాడు' అని అతుల్ వాసన్ మీడియాకు వివరించాడు. బెంగళూరు తొక్కిసలాటపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ కూడా స్పందించాడు. 'చిన్నస్వామి స్టేడియంలో జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారి గురించి ప్రార్థిస్తున్నాను' అని అతడు తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

# బైసున్ అదుర్స్

పారిస్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 361వ స్థానం.. గ్రాండ్‌స్లామ్ టోర్నీకి అర్హత సాధించే అవకాశమే లేదు.. స్థానిక క్రీడాకారిణి హోదాలో వైల్డ్ కార్డు లభించడంతో తొలి గ్రాండ్‌స్లామ్ ఆడే అవకాశం.. తొలి రౌండ్ దాటితే కూడా గొప్పే అనుకున్నారు..! కానీ ఆ అమ్మాయి అక్కడితో ఆగిపోలేదు. వరుస సంచలనాలతో ఏకంగా ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్లో ప్రవేశించింది. 36 ఏళ్ల విరామం తర్వాత ఆడిన తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్ చేరిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది ఫ్రాన్స్ అమ్మాయి లూయిస్ బైసున్. క్వార్టర్‌ఫైనల్లో ఈ అనామక క్రీడాకారిణి ఆరో సీడ్ మిరా ఆంద్రీవ (రష్యా)కు షాకిచ్చింది. కోకో గాఫ్ (అమెరికా), జానిక్ సినర్ (ఇటలీ) కూడా సెమీస్ చేరారు.

ఫ్రెంచ్ ఓపెన్‌లో లూయిస్ బైసున్ సంచలన యాత్ర కొనసాగుతోంది. ఈ 22 ఏళ్ల ఫ్రాన్స్ అమ్మాయి ఆరోసీడ్ రష్యా స్టార్ మిరా ఆంద్రీవాను ఇంటికి పంపింది. బుధవారం బైసున్ 7-6 (8-6), 6-3తో విజయాన్ని అందుకుంది. తొలి సెట్ నువ్వానేనా అన్నట్టుగా సాగింది. రెండుసార్లు ప్రత్యర్థికి బ్రేక్ పాయింటు కోల్పోయే ప్రమాదాన్ని బైసున్ తప్పించుకుంది. బంతిని స్పిన్ చేస్తూ.. బలమైన గ్రౌండ్‌స్ట్రోక్‌లతో ప్రత్యర్థిని అసహనానికి గురిచేసిన బైసున్ గట్టిగా పోరాడింది. ఒక దశలో ఆంద్రీవా 5-3తో సెట్ సాధించేలా కనిపించింది. మూడు సెట్ పాయింట్లు లభించినా ఆంద్రీవా వృథా చేసుకుంది. చివరకు సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. అక్కడ ఆధిపత్యం ప్రదర్శించిన బైసున్ సెట్‌ను గెలుచుకుంది. ప్రేక్షకుల మద్దతు స్థానిక క్రీడాకారిణికి ఉండటంతో లయ తప్పిన ఆంద్రీవా రెండో సెట్లో అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. త్వరగానే ఈ సెట్ గెలిచిన బైసున్ సెమీస్‌లో అడుగుపెట్టింది. మోనికా సెలెస్ (1989) తర్వాత ఆడిన తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్ చేరిన ప్లేయర్ బైసునే. అమేలి మౌరెస్మో (1999) తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ సెమీస్‌లో చేరిన పిన్న వయసు ఫ్రాన్స్ క్రీడాకారిణి కూడా బైసునే. ఫైనల్లో చోటు కోసం ఆమె అమెరికా స్టార్ కోకో గాఫ్‌ను ఎదుర్కోనుంది. హోరాహోరీగా సాగిన మరో క్వార్టర్స్‌లో రెండో సీడ్ కోకో గాఫ్ 6-7 (6-8), 6-4, 6-1తో ఏడో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా)ను ఓడించింది.


బైసున్

ఎదురులేని సినర్: డోపింగ్ వల్ల నిషేధం పడి, విరామం వచ్చినా ఇటలీ అగ్రశ్రేణి ఆటగాడు యానిక్ సినర్ జోరేమీ తగ్గలేదు. అతను వరుసగా 19వ గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లో విజయం సాధించాడు.

# సినిమాల నుంచి గ్యాప్ రావడానికి కారణమదే: రానా




: తన సినీ కెరీర్ గురించి నటుడు రానా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దాదాపు రెండేళ్ల నుంచి వెండితెరపై కనిపించకపోవడం గురించి ఐఫా ఉత్సవ్ ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. "నా జీవితం అంతా కొత్త సినిమాలు చేస్తూ వచ్చాను. ఇప్పుడు ఆ సినిమాలు మామూలు అయిపోయాయి. అందరూ చేస్తున్నారు. కొత్తగా ఏదైనా చేద్దామని కొంతకాలంగా వెతుకుతున్నా. అలా, సుమారు రెండేళ్లు గడిచిపోయింది. త్వరలోనే కొత్త సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంటా" అని అన్నారు.

'లీడర్ 2' గురించి ప్రశ్నించగా.. ఆ విషయాన్ని దర్శకుడు శేఖర్ కమ్ములను అడగాలని సరదాగా బదులిచ్చారు. అనంతరం ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' సక్సెస్‌పై మాట్లాడారు. "ఆ సినిమా ఘన విజయం అందుకున్నందుకు నేనెంతో సంతోషంగా ఉన్నా. అందులో వర్క్ చేసిన వారందరితో నాకు మంచి అనుబంధం ఉంది. ఈ సినిమా గొప్పగా ఉంటుందని విడుదలకు ముందే నమ్మా. అందరి ఊహాలకు మించి విజయాన్ని అందుకున్నందుకు ఆనందిస్తున్నా" అని చెప్పారు. ప్రభాస్‌తో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోవడంపై మాట్లాడుతూ.. మేమిద్దరం కలిసి చేస్తే తప్పకుండా ఏదైనా స్పెషల్‌గా చేస్తామని సమాధానమిచ్చారు.

2022లో విడుదలైన 'విరాటపర్వం' తర్వాత రానా హీరోగా కొత్త చిత్రాల్లో నటించిన దాఖలాల్లేవు. ఎంతోకాలం నుంచి వాయిదా పడుతూ వచ్చిన '1945' కూడా అదే ఏడాదిలో విడుదలైంది. గతేడాది 'రానా నాయుడు' సిరీస్‌తో ఓటీటీ వేదికగా అలరించారు. నిఖిల్ హీరోగా నటించిన 'స్పై'లో అతిథి పాత్ర పోషించారు. ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా నటిస్తోన్న 'వేట్టయాన్'లో రానా కీలక పాత్ర పోషిస్తున్నారు.

# ఆలస్యంగా మీనాకుమారి బయోపిక్

జానర్ ఏదైనా.. పాత్రలో ఒదిగిపోయి తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తుంటుంది కథానాయిక కృతి సనన్. త్వరలో 'దో పత్తీ'తో రావడానికి ముస్తాబవుతోన్న ఈ భామ.. అలనాటి అందాల తార మీనా కుమారి బయోపిక్‌లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఫ్యాషన్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరులో ఈ ప్రాజెక్టును సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నట్లు ఇప్పటికే తెలిపింది చిత్రబృందం. ఇప్పుడీ సినిమా చిత్రీకరణ మరోసారి వాయిదా పడినట్లు తెలుస్తోంది. "బైజుబావ్రా', 'పాకీజా' లాంటి క్లాసిక్ చిత్రాలతో తనకంటూ పరిశ్రమలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్న మీనా కుమారి వ్యక్తిగత జీవితంలో ఎన్నో తెలియని విషయాలు దాగి ఉన్నాయి. వాటిన్నింటినీ ప్రపంచానికి చూపించడానికి చాలా కష్టపడుతోంది చిత్రబృందం. ఆలస్యమైనా ప్రేక్షకులను మెప్పించేలా కథను తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం స్క్రిప్ట్ ముగింపు దశలో ఉంది. ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా పూర్తి చేసి.. 2025 ప్రథమార్ధంలో చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని మల్హోత్రా సన్నిహిత వర్గాలు తెలిపాయి.



కృతి సనన్

# ఆ క్లైమాక్స్ నన్ను భావోద్వేగానికి గురి చేసింది: సాయిధరమ్ తేజ్



బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావ్ ప్రధాన పాత్రలో నటించిన 'శ్రీకాంత్' చిత్రంపై నటుడు సాయిధరమ్ తేజ్ పశంసల వర్షం కురిపించారు. తాజాగా దీన్ని వీక్షించిన ఆయన ఎక్స్ (ట్విటర్) వేదికగా పోస్ట్ పెట్టారు. "తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బొల్లాంట్ ఇండస్ట్రీస్ అధినేత శ్రీకాంత్ బొల్లా జీవితాన్ని ఆధారంగా చేసుకొని తెరకెక్కిన 'శ్రీకాంత్' చూశా. ఇదొక అపురూప చిత్రం. రాజ్‌కుమార్ రావ్.. మీ ప్రదర్శన అత్యద్భుతంగా ఉంది. మీ నటనతో ఈ స్ఫూర్తిదాయక కథకు జీవం పోశారు. క్లైమాక్స్ చూసి నా కళ్లు చెమర్చాయి. ఆ సన్నివేశాలు నన్ను ఆలోచింపచేశాయి. శరద్ ఖేల్కర్, జ్యోతిక పెర్ఫార్మెన్స్ నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. గ్రేట్ వర్క్ తుషార్ హిరానీ" అని పేర్కొన్నారు.

శ్రీకాంత్ బొల్లా నేపథ్యం..

జులై 7, 1992న ఆంధ్రప్రదేశ్ మచిలీపట్నంలో శ్రీకాంత్ జన్మించారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన.. పదకొండో తరగతిలో 98శాతం మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఇంజినీరింగ్ చదవాలనుకున్నప్పటికీ.. అంధుడని చెప్పి అనుమతి ఇచ్చేందుకు ఐఐటీ నిరాకరించింది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా.. అన్నింటినీ అధిగమించారు. అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బ్రెయిన్ కాగ్నిటివ్ సైన్స్‌లో చేరిన తొలి అంధుడిగా శ్రీకాంత్ రికార్డు సృష్టించారు. తర్వాత ప్రపంచస్థాయి సంస్థల ఉద్యోగావకాశాల్ని కాదని.. 2012లో హైదరాబాద్ కేంద్రంగా బొల్లాంట్ ఇండస్ట్రీస్‌ను స్థాపించారు. దీని ద్వారా 2500 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పించారు. మరో మూడు వేల మంది దివ్యాంగులకు ఉచితంగా చదువు చెప్పిస్తున్నారు. పర్యావరణమే మనిషి బతుకని నమ్మే శ్రీకాంత్ తన పరిశ్రమల్ని సౌర విద్యుత్తుతో నడిపిస్తూ, జీరో వేస్ట్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. 2005లో లీడ్ ఇండియా కార్యక్రమం ద్వారా లక్షల మందిని ఉద్దేశించి స్ఫూర్తి ప్రసంగాలు చేశారు.

# సవాళ్లను దాటి మెరుగుపడితేనే.

"భాషాపరమైన వాద్దులు నెమ్మదిగా కనుమరుగై పోతున్నాయన్న సమయంలో నేను చిత్ర సీమలోకి అడుగుపెట్టాను. ఇప్పుడు దాదాపు ఏ భాషలో సినిమా వచ్చినా అన్ని భాషల ప్రేక్షకులు చూస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం. ఆ స్ఫూర్తితోనే నేనూ హిందీలోకి నా తొలి అడుగులు వేస్తున్నా"అని చెబుతోంది కథానాయిక సంయుక్తా మేనన్. 'విరూపాక్ష', 'సార్' లాంటి విజయాలతో దక్షిణాది ప్రేక్షకులను అలరించిన ఈ నాయిక ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమైంది. 'మహారాగ్ని' పేరుతో ప్రభుదేవా, కాజోల్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సంయుక్త నటిస్తోంది. ఈ నేపథ్యంలోనే సంయుక్త మాట్లాడుతూ "భాషతో సంబంధం లేకుండా నటీనటులు కథలను ఎంచుకుంటున్నారు. తెలుగు నటులు హిందీలో అలరిస్తుంటే అక్కడివాళ్లు దక్షిణాదిలో మంచి పాత్రలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం నేను హిందీలోనూ నిరూపించుకునే దిశగా కష్టపడుతున్నాను. నటులు ఎలాంటి పాత్ర పోషించడానికైనా సిద్ధంగా ఉండాలి. సవాళు ఎదురైనా వాటిని దాటి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ముందుకెళ్లాలనేది నా అభిప్రాయం. నాకు తెలిసి హిందీ చిత్రసీమలో ఆరోగ్యకరమైన పోటీయే ఉంటుంది అనుకుంటున్నాను" అని చెప్పింది.



సంయుక్తా మేనన్

# నాని సరసన జాన్వీ

శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్‌కి తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. 'దేవర' చిత్రంలో ఎన్టీఆర్ సరసన నటిస్తున్న ఆమె, తదుపరి రామ్‌చరణ్ సరసన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఆ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇంతలో మరో అవకాశం ఆమె చేతికందినట్టు తెలుస్తోంది. ఈసారి ఆమె నాని సరసన నటించనుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కనుంది. 'దసరా' తర్వాత ఈ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. ఇందులోనే జాన్వీ కపూర్ కథానాయికగా నటించనుంది. కాల్షీట్లు సర్దుబాటు గురించి ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. అవన్నీ కొలిక్కి వస్తే ఈ కలయిక ఖాయమైనట్టే. ప్రస్తుతం నాని 'సరిపోదా శనివారం' చిత్రంలో నటిస్తున్నారు. అది పూర్తయిన వెంటనే ఈ చిత్రం కోసమే రంగంలోకి దిగనున్నారు.





# బ్రహ్మ రాక్షసుడిలా... రాయన్

ధనుష్ 'రాయన్'తో యాభై సినిమాల మైలురాయిని చేరుకున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రమిది. దుషారా విజయన్, సందీప్ కిషన్, కాళిదాస్ జయరామ్, అపర్ణ బాలమురళి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఈ నెల 26న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'అడవిలో బలమైన జంతువులు పులి, సింహాలే. కానీ ప్రమాదకరమైన జంతువు తోడేలు...' అంటూ మొదలయ్యే ట్రైలర్‌లో 'బ్రహ్మరాక్షసుడిలా వస్తాడు... దహనం చేస్తాడు' అంటూ ధనుష్ పాత్రని పరిచయం చేశారు. ఆయన మాస్ అవతారం, యాక్షన్ ఘట్టాలు ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ సినిమాలోని కథ, కథనాలు, పాత్రలు అలరిస్తాయని సినీ వర్గాలు తెలిపాయి. ప్రకాశ్‌రాజ్, వరలక్ష్మీ శరత్‌కుమార్, సెల్వరాఘవన్, శరవణన్ తదితరులు నటించారు.



ధనుష్

# ప్రేమ ప్రయాణం

ఒక కొత్త అంశాన్ని ప్రేక్షకులకు చెప్పాలనే ఉద్దేశంతో చేసిన ప్రయత్నమే 'రోటి కపడా రొమాన్స్' చిత్రం అన్నారు బెక్కం వేణుగోపాల్. ఆయన సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మించిన చిత్రమిది. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి ప్రధాన పాత్రధారులు. విక్రమ్ రెడ్డి దర్శకుడు. ఆగస్టు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని పాట ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. యువ కథానాయకుడు విష్వక్‌సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాట విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ "ప్రేమకథలపై నిర్మాత బెక్కం వేణుగోపాల్‌కి మంచి గురి ఉంది. ప్రతి సినిమానీ ఎంతో తపనతో నిర్మిస్తాడు. ఈ బృందాన్ని చూస్తుంటే నాకు 'ఈ నగరానికి ఏమైంది?' రోజులు గుర్తొస్తున్నాయి. అందరికీ ఈ సినిమా మంచి ఫలితాన్నిస్తుందని ఆశిస్తున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "భావోద్వేగాలతో కూడిన ప్రేమ ప్రయాణమే ఈ చిత్రం" అన్నారు.

# పళ్లెంలో శత్రువులతో దుష్పరిణామాలెన్నో..

ఆరోగ్యకరమైన ఆహారంతోనే ఆరోగ్యకరమైన మెదడు సాధ్యం. అయితే, మనం తెలిసో తెలియకో మెదడుకు హాని కలిగించే పదార్థాలు తింటాం. వీటిని, మరీ ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. ఆందోళన, కుంగుబాటు లాంటి అవలక్షణాలూ దాపురిస్తాయి. అలా మెదడు సామర్థ్యం దెబ్బతింటుంది.

మద్యం వ్యసనంగా మారితే వినాశకారే. కాలక్రమంలో బ్రెయిన్ ఫాగింగ్ (దిమ్మ తిరిగినట్లు ఉంటుంది) కు దారితీస్తుంది. మద్యం తాగేవాళ్లకు దీర్ఘకాలంలో జ్ఞాపకశక్తి క్షీణత, కుంగుబాటు, ఆందోళన మొదలైన మానసిక సమస్యలు ముమ్మరిస్తాయి.

చక్కెరలు అధికంగా ఉండే పదార్థాలు క్యాన్సర్ కణాల పెరుగుదలకు దారి తీస్తాయి. జ్ఞాపకశక్తి మీద కూడా ప్రభావం చూపుతాయి.

రంగురంగుల ప్యాకెట్లలో విక్రయించే ప్రాసెస్డ్ ఫుడ్స్ తయారీలో ఉపయోగించే వర్ణాలు, రసాయనాలు తీవ్ర హానికరం. ఇవి మెదడుకు కీడుచేస్తాయి. వేయించిన (ఫ్రైడ్) ఆహారాలు పిల్లల్లో హైపర్ యాక్టివిటీకి కారణమవుతాయి.



%రెడీ-టు-కుక్ పదార్థాల్లో కూడా యాడిటివ్స్, ప్రిజర్వేటివ్స్ ఎక్కువగానే ఉంటాయి. వీటిని మెదడు సంబంధ వ్యాధులైన అల్జీమర్స్ లాంటివాటికి ప్రేరకాలుగా గుర్తించారు.

జంక్ ఫుడ్స్‌లో ఎన్నో రసాయనాలు, కృత్రిమ రుచి కారకాలు కలుపుతారు. ఇవి మెదడు రసాయన గుణాలను మార్చేస్తాయి. ఆందోళన, కుంగుబాటు లాంటి మానసిక సమస్యలకు దారితీస్తాయి. పైగా వీటిలో ఉప్పు కూడా ఎక్కువగానే ఉంటుంది.

ఇక ఉప్పు అనారోగ్యాలకు బాటలువేస్తుంది. శరీరం, మెదడు పనితీరు మీద దుష్ప్రభావం చూపుతుంది. జ్ఞాపకశక్తి క్షీణతతోపాటు మరెన్నో సమస్యలకు మూలం అవుతుంది.

హాట్‌డాగ్స్ లాంటివి కూడా ప్రాసెస్ చేసిన ప్రొటీన్ ఆహార పదార్థాల కిందికే వస్తాయి. శరీరంలో కండరాల నిర్మాణానికి, కణాలు ఆరోగ్యంగా పనిచేయడానికి ప్రొటీన్లు అత్యవసరం. కాకపోతే ప్రాసెస్ చేసిన ప్రొటీన్ పదార్థాల్లో ఎన్నో యాడిటివ్స్ ఉంటాయి. కాబట్టి, వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

# వెల్లుల్లి సలాడ్.. బీపీ పరార్..!

అధిక రక్తపోటు.. సరికొత్త సమస్య కానేకాదు. కాకపోతే, నానాటికీ పెరుగుతున్న అనారోగ్యకర ధోరణి. శారీరక శ్రమలేని జీవన విధానం చెడు కొవ్వును పెంచేస్తుంటే.. ఒత్తిడి మనసులను చిత్తుచేస్తున్నది. పోషకాలు కరువైన ఆహారం సరేసరి. ఇవన్నీ రక్తపోటుకు రాచమార్గాలే. వెల్లుల్లి, దోస సలాడ్‌తో హైబీపీని అడ్డుకోవచ్చంటారు ఆహార నిపుణులు.

వెల్లుల్లిని చిదిమి, అందులో దోసకాయ ముక్కలు వేసి%ూా% నాలుగు చుక్కల యాపిల్ సిడార్ వెనిగర్ జోడించి కలియతిప్పితే సలాడ్ సిద్ధం. దీనివల్ల ఎన్నో ఉపయోగాలు.



దోసలో మెగ్నీషియం, పొటాషియంతో పాటు తగినంత నీరు ఉంటుంది. ఒంట్లోని సోడియం నిల్వలను అదుపు చేసే సామర్థ్యం పొటాషియంకు ఉంది. దీనివల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది.

దోసకాయలోని పీచుపదార్థం దెబ్బకు చెడుకొవ్వు తగ్గుతుంది. ఊబకాయాన్ని ఎదుర్కొనేందుకు, మధుమేహాన్ని దూరం చేసేందుకు ఇది ఎంతో సాయపడుతుంది.

వెల్లుల్లిలోని అలిసిన్ అనే రసాయనం చెడు కొవ్వును తగ్గించడంలో, రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది.

రక్తాన్ని శుద్ధిచేసే గుణం వెల్లుల్లిలో అపారం. రక్తపోటును తగ్గించడవే కాకుండా, గుండెకూ బలాన్నిస్తుంది.

దోసలోని నీరు రక్తపోటును అదుపు చేస్తుంది. వారానికి అయిదు సార్లు ఈ వెల్లుల్లి దోస సలాడ్ తీసుకుంటే రక్తపోటు అదుపులో ఉంటుందనీ భరోసా ఇస్తున్నారు నిపుణులు. కాకపోతే, దీనికి ఆరోగ్యకర జీవనశైలి తోడు కావాలి.

# కార్డియాక్ అరెస్ట్ ముప్పు తప్పాలంటే వీటిని పాటిస్తే మేలు..!

పపంచవ్యాప్తంగా హృద్రోగాలు పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. గుండె జబ్బులు లేనివారిలోనూ లక్షణాలు బయటపడిన గంటలోపే సడన్ కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు పోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. అప్పటిదాకా ఆరోగ్యంగా కనిపించిన వారు క్షణాల్లోనే కుప్పకూలి మృత్యువాతన పడుతుండటం కలకలం రేపుతోంది. గుండె లయ దెబ్బతినడంతో గుండె పనిచేయని పరిస్థితి తలెత్తి కార్డియాక్ అరెస్ట్‌తో మరణిస్తున్న కేసులు వెలుగుచూస్తున్నాయి.



యువతలోనూ సడన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న యువ హృదయాలు తల్లడిల్లుతున్నాయి. గుండె లయ తప్పడంతో శ్వాస ఆగిపోవడంతో సడన్ కార్డియాక్ అరెస్ట్ ఘటనలు నమోదవుతున్నాయి. కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉన్న వారిలో 80 శాతం కేసులు వెలుగుచూస్తున్నాయని, యాంజియోగ్రాఫీ చేయిస్తే వీరిలో బ్లాక్స్ పేరుకుపోవడం కనిపిస్తుందని మ్యాక్స్ స్మార్ట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రిన్సిపల్ డైరెక్టర్, కార్డియాలజీ డైరెక్టర్ డాక్టర్ రాజీవ్ అగర్వాల్ పేర్కొన్నారు.

యువతలో సడన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరగడంతో వీటి ముప్పును, నివారించే చర్యల గురించి అవగాహన పెంచుకోవడం కీలకమని డాక్టర్ అగర్వాల్ చెబుతున్నారు. హృద్రోగ ముప్పునకు కరోనరీ ఆర్టరీ డిసీజ్ ముప్పు కారకాల్లో ప్రధానమైన బీపీని అదుపులో ఉంచుకోవాలి, ధూమపానం మానేయడం, మధుమేహ నియంత్రణ, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడంతో పాటు శారీరకంగా చురుకుగా ఉండాలని డాక్టర్ అగర్వాల్ చెప్పుకొచ్చారు. వీటితో పాటు శరీరానికి అవసరమైనంత పోషకాహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. 20 ఏండ్లు దాటిన వారంతా తరచూ ఈసీజీతో పాటు ఇతర ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

# 4.3కోట్ల మంది భారతీయ మహిళల్లో తీవ్రమైన వ్యాధి..! అప్రమత్తంగా లేకపోతే..?

మారుతూ వస్తున్న జీవనశైలి కారణంగా ఆరోగ్య సమస్య పెరుగుతున్నాయి. గత దశాబ్దపు గణాంకాలను పరిశీలిస్తే.. వివిధ రకాల వ్యాధుల ప్రమాదం పెరుగుతూ వస్తున్నది. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ తదితర వ్యాధులు ఇబ్బందికరంగా మారాయి. అయితే, కొన్ని వ్యాధులు మహిళలకు ప్రభావితం చేస్తున్నాయి. సరైన రోగ నిర్ధారణ, చికిత్స లేకపోవడంతో వల్ల పరిస్థితి మరింత తీవ్రమవుతుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో భారత్‌లో దాదాపు 4.3 కోట్ల మంది మహిళలు ఎండ్రోమెట్రియోసిస్‌తో బాధపడుతున్నట్లుగా శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఇది పునరుత్పత్తి సమస్యలకు ప్రధాన కారణంగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, వంధ్యత్వం తదిత సమస్యలకు సైతం దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. యువతులు సైతం దీని బారినపడుతున్నారు.

ఎండ్రోమెట్రియోసిస్ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 19 కోట్ల మంది ఎండోమెట్రియోసిస్ సమస్యతో బాధపడుతున్నట్లుగా గణాంకాలు పేర్కొంటున్నాయి. భారత్‌లో 15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయసున్న 10శాతం మంది మహిళల్లో ఈ సమస్యను గుర్తించారు. జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్‌లోని భారతీయ పరిశోధకులు దేశంతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో ఎండోమెట్రియోసిస్‌పై శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. చాలా మంది మహిళలకు ఈ సమస్య ఉన్నట్లు తెలియకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. అవగాహన లోపంతో వ్యాధికి సకాలంలో చికిత్స అందడం లేదని నిపుణులు చెబుతున్నారు.

సమస్యలు ఇవే..

ఎండోమెట్రియోసిస్‌తో బాధపడుతున్న మహిళలు తరచుగా నొప్పి (పెల్విక్, బ్యాక్ అబ్డామిన్)తో బాధపడుతుంటారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మెనుస్ట్రువల్ సైకిల్‌లో శరీరంలోని హార్మోన్ల మార్పుల కారణంగా ఎండోమెట్రియల్ ( వంటి కణజాలంలోని కణాలు పెరగడం ప్రారంభిస్తాయని, ఆ తర్వాత విచ్ఛిన్నమవుతాయి. దాంతో రక్తస్రావం సమస్యలను కలిగిస్తుంది.

పీరియడ్స్ సమయంలో రక్తం శరీరం నుంచి బయటకు వెళుతుంది. అయితే, కణాల విచ్ఛిన్నంతో కలిగే రక్తస్రావం శరీరం లోపల ఉండిపోతుంది. ఇది వాపుతో పాటు అనేక సమస్యలకు దారి తీస్తుంది. సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే, పునరుత్పత్తి సమస్యలకు దారి తీస్తుంది.

నిపుణులు ఏమంటున్నారు?

గ్లోబల్ ఉమెన్స్ హెల్త్ ప్రోగ్రామ్ సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ ప్రీతి రాజ్‌బంగ్షి మాట్లాడుతూ పీరియడ్స్ సమయంలో నొప్పిపై శ్రద్ధ లేకపోవడం, ఎండోమెట్రియోసిస్ సమస్యపై అవగాహన లేకపోవడంతో వ్యాధి సకాలంలో గుర్తించలేకపోతున్నట్లు తెలిపారు. ఇది అంతర్గతంగా తీవ్రమైన సమస్యలను పెంచుతుందన్నారు. మహిళల్లో ఎండోమెట్రియోసిస్ ముందస్తు రోగనిర్ధారణ, చికిత్సను మెరుగుపరచాల్సిన అవసరం గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని పరిశోధనలు నొక్కి చెబుతున్నాయన్నారు. లక్షణాలపై శ్రద్ధ వహించడంతో పాటు వైద్యుల సలహాలు పాటించాలని సూచిస్తున్నారు.

ఎలా గుర్తించాలంటే..

ఎండోమెట్రియోసిస్‌తో బాధపడే మహిళల్లో పీరియడ్స్ సమయంలో తిమ్మిర్లు,



నొప్పి, కడుపు, వెన్నులో విపరీతమైన నొప్పి, శృంగారంలో పాల్గొనే సమయంలో నొప్పి, పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం తదితర లక్షణాలు కనిపిస్తాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఎండోమెట్రియోసిస్‌తో జాగ్రత్తలు తీసుకోకపోతే గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు. అయితే, కుటుంబంలో ఇప్పటికే ఎవరైనా ఇలాంటి సమస్య బారినపడ్డ వారుంటే ఉంటే.. మిగతా వారు ఎండోమెట్రియోసిస్ బారినపడే ప్రమాదం బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రుతుస్రావం సమయంలో ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించారు.

# లేటెస్ట్ డైట్ ప్లాన్ : అట్లాంటిక్ డైట్‌తో ఆరోగ్య ప్రయోజనాలు

మరో లేటెస్ట్ డైట్ ఇప్పుడు ఇంటర్‌నెట్‌లో మార్మోగుతోంది. అట్లాంటిక్ డైట్ ఆరోగ్యానికి ప్రయోజనకరమని ప్రపంచవ్యాప్తంగా పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారంగా పేరొందిన మధ్యప్రాచ్య ఆహారానికి అట్లాంటిక్ డైట్ దగ్గరగా ఉంటుంది. అట్లాంటిక్ డైట్ బరువు తగ్గేందుకు సహాయపడటంతో పాటు శరీరంలో మంచి కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను ప్రేరేపిస్తుంది.



అట్లాంటిక్ డైట్ వీటితో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుందని చెబుతున్నారు. ఈ డైట్ ఆరోగ్యానికి ఎలా మేలుచేస్తుందనే వివరాలను జామా నెట్‌వర్క్ ఓపెన్‌లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. స్పెయిన్‌లో అట్లాంటిక్ డైట్ ప్లాన్‌ను అనుసరించే 200 కుటుంబాలపై ఈ అధ్యయనం నిర్వహించారు.

ఆరు నెలల అనంతరం వీరిలో కొలెస్ట్రాల్ లెవెల్స్ తగ్గడంతో పాటు బీపీ, ఫాస్టింగ్ గ్లూకోజ్ లెవెల్స్, శరీర బరువు సరిగ్గా ఉన్నాయని గుర్తించారు. ఈ డైట్ ప్లాన్‌ను అనుసరించే వారిలో మెటబాలిక్ సిండ్రోమ్ తలెత్తే అవకాశాలు తగ్గాయని పరిశోధకులు వెల్లడించారు. ఇక అట్లాంటిక్ డైట్‌లో భాగంగా స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, సిరిల్స్, ఫిష్, డైరీ ఉత్పత్తులు, ఆలివ్ ఆయిల్‌తో పాటు పరిమిత మోతాదులో వైన్ కూడా తీసుకుంటారు. సీజనల్, స్థానికంగా లభ్యమయ్యే పండ్లు, కూరగాయలను అధికంగా తీసుకుంటూ తక్కువ ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకుంటారు.

# ఆరోగ్యానికి మెగా బూస్ట్ : ఒమెగా 3 ఆమ్లాలు లోపిస్తే ఏం జరుగుతుందంటే..!

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ మన ఆరోగ్యానికి ఎంతో కీలకం. మెదడు, గుండె పనితీరుకు ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అవసరం. కుంగుబాటు, ఆందోళన వంటి మానసిక సమస్యలను నివారించి రోజంతా చురుకుగా ఉండేందుకూ ఒమెగా 3 ఆమ్లాలు కీలకంగా పనిచేస్తాయి.




గర్భిణీ స్త్రీలు తగినంత ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు తీసుకుంటే పిల్లల్లో మెదడు చురుకుగా ఉండటంతో పాటు మెరుగైన కమ్యూనికేషన్స్, సోషల్ స్కిల్స్ ప్రేరేపిస్తాయి. శాకాహారుల్లో ఒమెగా-3 లోపం తలెత్తడం సహజం. ఇతర పోషకాహార లోపాన్ని భర్తీ చేయడంలో చూపిన ఆసక్తితో పోలిస్తే ఒమెగా 3 ఆమ్లాల లోపాన్ని పెద్దగా పట్టించుకోరు.

అయితే ఒమెగా-3 లోపంతో పలు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ ఫ్యాటీ ఆమ్లం లోపిస్తే కుంగుబాటు, చర్మ, కేశ సమస్యలు, కండరాల నొప్పులు, కండ్లు పొడిబారటం, తీవ్ర అలసట, నీరసం, నిస్సత్తువ వంటి ఇబ్బందులు, లక్షణాలు వేధిస్తాయి. ఇక సాల్మన్ చేపలు, అవిశె గింజలు, చియా సీడ్స్, వాల్‌నట్స్, సోయాబీన్స్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి ఆహార పదార్థాల్లో ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు సమృద్ధిగా లభిస్తాయి.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy